B9 NEWS
నిజం - మా ఇజం

# మన.. ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం...






PUBLISHED FROM: Telangana & Andhrapradesh | సంపుటి : 01 | సంచిక : 241 | సోమవారం | 14-09-2026 | ఎడిటర్ : పులిజ్వాల చంద్రకాంత్ | పేజీలు : 08 | వెల : 05/-




## బాధ లేదు.. కానీ!

- మంత్రి పదవి పోయిందన్న బాధ లేదు.. కానీ!: కొండా సురేఖ
- తాను కాంగ్రెస్ పార్టీని వీడుతున్నానన్న ప్రచారాన్ని కొట్టిపారేసిన కొండా సురేఖ
- మంత్రి పదవి పోయినందుకు బాధ లేదు, కానీ కారణం చెప్పకపోవడమే ఆవేదన కలిగించింది
- భవిష్యత్తులోనూ కాంగ్రెస్ టికెట్‌పైనే పోటీ చేస్తామని స్పష్టం చేసిన కొండా దంపతులు
- స్థానిక నేతలపై పరోక్షంగా విమర్శలు గుప్పించిన మాజీ మంత్రి 2
- త్వరలో తన భర్త కొండా మురళికి పదవి వస్తుందన్న సంకేతాలు ఉన్నాయని వెల్లడి

**మన ప్రజాపక్షం,వరంగల్**

తాను కాంగ్రెస్ పార్టీని వీడుతున్నట్టుగా కొన్ని రోజులుగా జరుగుతున్న ప్రచారానికి మాజీ మంత్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యే కొండా సురేఖ ఫుల్ స్టాప్ పెట్టారు. ఆ వార్తలన్నీ నిరాధారమైనవని, కేవలం కల్పిత కథనాలని ఆమె కొట్టిపారేశారు. తన భర్త కొండా మురళితో కలిసి ఆదివారం వరంగల్‌లో పార్టీ



## రోశయ్య దూరదృష్టి వల్లే మిగులు బడ్జెట్







**రోశయ్య దూరదృష్టి వల్లే తెలంగాణకు మిగులు బడ్జెట్ వచ్చింది : సీఎం రేవంత్ రెడ్డి**

**మన ప్రజాపక్షం,హైదరాబాద్** 2

హైదరాబాద్ ఉప్పల్ భగాయత్ లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన్‌కు భూమిపూజ చేసిన సీఎం రేవంత్ రెడ్డి ఆర్యవైశ్యుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి రోశయ్య విగ్రహం హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తామన్నారు.

ఆర్యవైశ్యులు సౌమ్యులు, ఆత్మాభిమానం కలిగిన వారన్న సీఎం రేవంత్ రెడ్డి పేదరికం ఉన్నా ఆర్యవైశ్యులు కడుపులో దాచుకుంటారని స్పష్టం చేసారు. ఆయన హైదరాబాద్ ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన్‌కు భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్నముఖ్యమంత్రి ఆర్యవైశ్య భవన నిర్మాణానికి సహకరిస్తానని, వారి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

**భవిష్యత్ ఉంటుందని రోశయ్య ఆనాడే సలహా ఇచ్చారు**

ఆర్యవైశ్యులు ఆకలితో ఉన్నవారి ఆకలి తీరుస్తున్నారని రేవంత్ రెడ్డి ప్రశంసించారు. ఆర్యవైశ్య సోదరులు పేదలకు ఉదారంగా అప్పు ఇస్తారని, తాను సుదీర్ఘ కాలం రాజకీయాల్లో రాణిస్తానని మాజీ సీఎం రోశయ్య గుర్తించారని పేర్కొన్నారు. అసెంబ్లీలో దూకుడుగా మాట్లాడుతుంటే ఆవేశం తగ్గించుకోవాలని చెప్పారని, ఆవేశానికి ఆలోచన తోడయితే భవిష్యత్ ఉంటుందని రోశయ్య సలహా ఇచ్చారని గుర్తు చేసుకున్నరు. రోశయ్య ఎవరినైనా విమర్శిస్తారు కానీ దూషించరని కొనియాడారు. రోశయ్య విగ్రహం హైదరాబాద్‌లో ఉండాలని నిర్ణయించామని, హైదరాబాద్‌తోనే తన అనుబంధం ముడిపడి ఉందని రోశయ్య చెప్పేవారని సీఎం వెల్లడించారు.



## యువతకు భారీ అవకాశాలు 2

**కోదాడలో కొలువుల జాతరకు రంగం సిద్ధం..**

సమాజంలో ప్రస్తుతం అతి పెద్ద సమస్య నిరుద్యోగమేనని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. కోదాడ పట్టణంలో ఈ నెల 19న నిర్వహించనున్న మెగా జాబ్ మేళా ఏర్పాట్లను అధికారులు, పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ జాబ్ మేళాకు సుమారు 300 కంపెనీలు వచ్చే అవకాశం ఉందని.. దాదాపు 25 వేల ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఈ జాబ్ మేళా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. గ్రామాల వారీగా విస్తృతంగా ప్రచారం నిర్వహించి ప్రతి ఒక్కరికీ సమాచారం

## రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే మా లక్ష్యం: కొండా మురళి

**మన ప్రజాపక్షం,వరంగల్**

కాంగ్రెస్ అధిష్ఠానం కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయడంపై కొండా మురళీ స్పందించారు. తమ కుమార్తె వ్యాఖ్యలకు, తమకు సంబంధం లేదన్న మురళి.. కాంగ్రెస్ పార్టీని వీడేదిలేదని తేల్చి చెప్పారు. వరంగల్‌లో నిర్వహించిన

## వారి గళాన్ని వినిపిస్తున్నాం..

**అందుకే బ్రిక్స్‌పై నమ్మకం: ప్రధాని మోదీ**

- బ్రిక్స్ కూటమిపై గ్లోబల్ సౌత్ దేశాలకు విశ్వాసం పెరిగిందన్న మోదీ
- అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ పరస్పర పూరకాలని స్పష్టం చేసిన ప్రధాని
- భిన్నత్వమే తమ బలమని, సహకారమే స్ఫూర్తి అని వ్యాఖ్య 2
- స్మార్ట్ గ్రిడ్లు, వ్యవసాయ రంగాల్లో కీలక కేంద్రాల ఏర్పాటును ప్రకటించిన మోదీ




**మన ప్రజాపక్షం,న్యూఢిల్లీ**

బ్రిక్స్ కూటమిలో గ్లోబల్ సౌత్ దేశాల గళాన్ని బలంగా వినిపిస్తున్నామని, అందుకే ఆ దేశాలకు ఈ కూటమిపై విశ్వాసం గణనీయంగా పెరిగిందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. భిన్నత్వం, సహకారమే బ్రిక్స్ బలానికి మూలమని ఆయన ఉద్ఘాటించారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఆదివారం జరిగిన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ముగింపు సమావేశంలో ప్రధాని ప్రసంగించారు. ఈ కూటమిలో గ్లోబల్ సౌత్ దేశాల ఆందోళనలు, అనుభవాలకు తగిన ప్రాధాన్యత ఇస్తున్నందునే వాటి నమ్మకాన్ని చూరగొన్నామని తెలిపారు."నా వ్యక్తిగత అనుభవం నుంచి చెబుతున్నాను, బ్రిక్స్ పట్ల గ్లోబల్ సౌత్ దేశాల విశ్వాసం



2

## వినాయక చవితి శుభాకాంక్షలు

**ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్**

**మన ప్రజాపక్షం,హైదరాబాద్**

రాష్ట్రంలోని ప్రజలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల జీవితాల్లో విఘ్నాలు తొలగి.. ఆనందం, ఐశ్వర్యం, ఆరోగ్యం కలగాలని ఆ విఘ్నేశ్వరుడిని ప్రార్థించినట్లు చెప్పారు. వాడవాడలా గణేష్ మండపాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించుకోవాలని ప్రజలకు ఆయన

## సారీ చెప్పి ఉంటే పదవి నిలిచేది

- సారీ చెప్పి ఉంటే కొండా సురేఖ పదవి నిలిచేది: కొండా మురళి 2
- కొండా సురేఖ మంత్రి పదవి కోల్పోయాక తొలిసారి స్పందించిన కొండా మురళి
- పదవి కోసం క్షమాపణ చెప్పేది లేదని సురేఖ తేల్చిచెప్పారని వెల్లడి
- కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదు, రాహుల్ గాంధీనే తమ నాయకుడన్న మురళి
- వచ్చే ఎన్నికల్లో గెలిచే గుర్రాలకు తామే టికెట్లు ఇస్తామని సంచలన ప్రకటన
- తన శరీరంలో నాలుగు బుల్లెట్లు ఉన్నా బతికే ఉన్నానని వ్యాఖ్య



**మన ప్రజాపక్షం,వరంగల్**

తెలంగాణ మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించిన తర్వాత ఆమె భర్త, కాంగ్రెస్ సీనియర్ నేత కొండా మురళి తొలిసారిగా స్పందించారు. వరంగల్‌లో కాంగ్రెస్ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన

## హైదరాబాద్‌లో డ్రంకెన్ డ్రైవ్..

**292 మందిపై కేసులు**

2



**మన ప్రజాపక్షం,హైదరాబాద్**

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన వీకెండ్ స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్‌లో ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 292 మందిపై కేసులు నమోదు

## ఈ వారంలోనే మంజూరు పత్రాలు

**ఇందిరమ్మ టవర్స్ ఎల్ఐజీ ఇళ్ల లబ్ధిదారులకు ఈ వారంలోనే కేటాయింపు పత్రాలు అందజేస్తామని హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి. గౌతమ్ తెలిపారు. మధ్యవర్తుల మాటలు నమ్మి డబ్బులు చెల్లించవద్దని సూచించారు.**

2



## భారత్‌పై దాడి చేయాలనే ఆలోచన వస్తే

**శత్రువుల వెన్నులో వణుకు పుట్టేలా ప్రధాని మోదీ చేశారు: అమిత్ షా**

- 2047 నాటికి దేశం అన్ని రంగాల్లో ముందుంటుందనే విశ్వాసాన్ని మోదీ ప్రజలకు కలిగించారన్న షా 2
- మోదీ నాయకత్వంలో దేశంలోని అన్ని రంగాల్లో సంస్కరణలు తీసుకువచ్చారని స్పష్టం
- డీకాలనైజేషన్ అంటే సత్యాన్ని ప్రామాణికంగా చూపడమేనని వ్యాఖ్య



# ఈ వారంలోనే మంజూరు పత్రాలు

మొదటి పేజీ రువాయి

హైదరాబాద్ క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్లలోని ఫ్లాట్ల కేటాయింపు ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోందని హౌసింగ్ బోర్డ్ వైస్ ఛైర్మన్ వి.పి. గౌతమ్ తెలిపారు. ఇళ్లు ఇప్పిస్తామని చెప్పే మధ్యవర్తుల మాటలు నమ్మి డబ్బులు ఇవ్వద్దని గౌతమ్ సూచించారు. లాటరీలో ఎంపికైన 7,340 మందిలో 6,643 క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయిందని, ఇప్పటి వరకు 5,521 మందిని అర్హులుగా తేల్చినట్లు తెలిపారు. ఈ వారంలో మిగతా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి కేటాయింపు పత్రాలు ఇవ్వనున్నట్లు గౌతమ్ వెల్లడించారు. లక్కీడ్రాలో ఎంపికైన అభ్యర్థులు తమకు ఇల్లు కేటాయిస్తారో లేదా అనే ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు.

**మధ్యవర్తుల మాయమాటలు నమ్మవద్దు**

ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక పూర్తి పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా కొనసాగుతోందని వీపీ గౌతమ్ స్పష్టం చేశారు. ఈ ప్రక్రియను ఆసరాగా చేసుకుని కొందరు మధ్యవర్తులు మభ్యపెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు, డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. గృహాల కేటాయింపు ప్రక్రియలో మధ్యవర్తులు లేదా ఇతర వ్యక్తులకు ఎలాంటి పాత్ర లేదన్నారు. లబ్ధిదారులు ఎవరికీ లంచం, కమీషన్ లేదా ఇతర రూపంలో డబ్బులు చెల్లించవద్దని సూచించారు. గృహానికి సంబంధించిన మొదటి విడత మొత్తాన్ని చెల్లించాల్సిన అధికారిక బ్యాంకు ఖాతా వివరాలు, చెల్లించాల్సిన మొత్తం, చెల్లింపు గడువు ఇతర సూచనలను కేటాయింపు పత్రంతోపాటే అధికారికంగా తెలియజేస్తామని ఆయన పేర్కొన్నారు.

**ఎవరైనా డబ్బులు అడిగితే ఫిర్యాదు చేయండి**

గృహాలు మంజూరు చేయిస్తామని ఎవరైనా డబ్బులు అడిగినా లేదా అనధికారిక ఖాతాలకు చెల్లించాలని కోరినా వెంటనే తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని హౌసింగ్ బోర్డు వీపీ గౌతమ్ సూచించారు. ఇటువంటి అక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లబ్ధిదారులు గృహాల కేటాయింపు, క్షేత్రస్థాయి పరిశీలన, కేటాయింపు పత్రాలు, మొదటి విడత చెల్లింపు తదితర అధికారిక సమాచారం కోసం తెలంగాణ హౌసింగ్ బోర్డు వెబ్‌సైట్ tghb.telangana.gov.in? ను సందర్శించవచ్చని, లేదా కాల్ సెంటర్ నంబరు 040-24603572ను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు. తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారికంగా జారీ చేసే ప్రకటనలు, కేటాయింపు పత్రాలు సంబంధిత అధికారుల సూచనలను మాత్రమే నమ్మాలని ఆయన లబ్ధిదారులకు విజ్ఞప్తి చేశారు.

**ఇళ్ల పథకానికి ఎంపిక కాని వారికి డిపాజిట్ చెల్లింపు**

ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఎంపిక కాని దరఖాస్తుదారులకు వారు చెల్లించిన రూ.10 వేల మొత్తాన్ని హౌసింగ్ బోర్డు వారి ఖాతాలో వేయనుందని బోర్డు వర్గాలు తెలిపాయి. ఇళ్లకు అప్లై చేసే సమయంలో ఒక్కో దరఖాస్తుదారుడు రూ.10 వేలు ధరావతుగా చెల్లించిన విషయం తెలిసిందే. రెవెన్యూ, రవాణా, జీహెచ్ఎంసీ తదితర శాఖల నుంచి తెప్పించుకున్న రిపోర్టుల ఆధారంగా హౌసింగ్ బోర్డు 360 డిగ్రీల ఎంక్వైరీ పేరిట వడపోసి తొలి విడతలోనే చాలా మందిని ఈ పథకానికి అనర్హులుగా తేల్చింది. 16 నియోజకవర్గాలకు మొత్తం 60,720 దరఖాస్తులు రాగా వాటిని పరిశీలించి సుమారు 40 వేల మందిని అనర్హులుగా తేల్చినట్లు తెలిసింది. ఇప్పుడు వీరందరికీ డబ్బులను తిరిగి తమ ఖాతాల్లో జమ చేయనుంది.

# వినాయక చవితి శుభాకాంక్షలు

మొదటి పేజీ రువాయి

పిలుపునిచ్చారు. గణేష్ నవరాత్రుల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని ఈ సందర్భంగా నగర పోలీసులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.భక్తుల రద్దీ అధికంగా ఉండే మండపాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. హైదరాబాద్ సహా అన్ని జిల్లా కేంద్రాల్లో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. వినాయక మండపాలకు ఈ ఏడాది కూడా ప్రభుత్వం ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తుందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

# హైదరాబాద్‌లో డ్రంకెన్ డ్రైవ్..

మొదటి పేజీ రువాయి

చేశారు. వీరిలో 240 మంది బైకర్లు, 12 మంది ఆటో డ్రైవర్లు, 40 మంది కారు డ్రైవర్లు ఉన్నారు. అధిక మోతాదులో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోనున్నారు. 14 మంది వాహనదారులకు 301 నుంచి 550 మధ్య బీఏసీ పాయింట్లు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన 292 మందిని చట్టపరమైన చర్యల్లో భాగంగా కోర్టు ముందు హాజరుపరచనున్నట్లు వెల్లడించారు.మద్యం సేవించి వాహనం నడపడం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు హెచ్చరించారు. డ్రంకెన్ డ్రైవ్ కారణంగా ప్రమాదం జరిగి ఇతరుల ప్రాణాలకు ముప్పు కలిగితే.. బీఎన్ఎస్ సెక్షన్ 105 కింద కేసు నమోదు చేసే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేరానికి గరిష్టంగా 10 ఏళ్ల వరకూ జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉందని పేర్కొన్నారు. గత వారం డ్రంకెన్ డ్రైవింగ్‌కు సంబంధించిన 681 కేసులను కోర్టులు పరిష్కరించగా, 18 మందికి జరిమానాతో పాటు జైలు శిక్ష విధించారు. మరో ఏడుగురికి జరిమానాతో పాటు సోషల్ సర్వీస్ శిక్ష విధించగా, మిగిలిన 656 మందికి జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

# సారీ చెప్పి ఉంటే పదవి నిలిచేది

మొదటి పేజీ రువాయి

మాట్లాడుతూ, తాము పార్టీ మారుతున్నామంటూ వస్తున్న ఊహాగానాలకు తెరదించారు. పదవి కోసం ఆత్మగౌరవాన్ని వదులుకోబోమని, కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు."ఒక్కసారి సారీ చెబితే చాలని నాయకులు సురేఖతో అన్నారు. కానీ, పదవి ఉంటే ఉండనీ, పోతే పోనీ, క్షమాపణ మాత్రం చెప్పనని సురేఖ కరాఖండిగా చెప్పింది" అని మురళి ఆనాటి పరిణామాలను వివరించారు. పదవులు ఈరోజు వచ్చి రేపు పోతాయని, కానీ కృతజ్ఞత తమ రక్తంలో, కుటుంబంలో ఉందని ఆయన వ్యాఖ్యానించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటామని, తమ విధేయత కాంగ్రెస్ పార్టీకేనని స్పష్టం చేశారు.రాహుల్ గాంధీ వల్లే సురేఖకు ఎమ్మెల్యేగా గెలిచే అవకాశం వచ్చిందని, ఆయన్ను ప్రధానిని చేయడమే తమ లక్ష్యమని కొండా మురళి ప్రకటించారు. "వచ్చే ఎన్నికల్లో గెలుపు గుర్రాలకు మేమే టికెట్లు ఇస్తాం" అంటూ వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి, మహేశ్ గౌడ్ వంటి నేతలు కూడా ఎన్నో పోరాటాలు చేసి పైకి వచ్చారని గుర్తుచేశారు. త్వరలో జరగనున్న కార్పొరేషన్ ఎన్నికల్లో చురుగ్గా పాల్గొంటామని తెలిపారు.ఈ సందర్భంగా కొండా మురళి భావోద్వేగానికి గురయ్యారు. "నా శరీరంలో నాలుగు బుల్లెట్లు ఉన్నాయి, అయినా ఇంకా బతికే ఉన్నాను" అని అన్నారు. తానూ, సురేఖ ఒకే మాటపై ఉంటామని, అయితే తమ కుమార్తె రాజకీయ భవిష్యత్తు ఆమె ఇష్టమని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలతో కొండా దంపతులు కాంగ్రెస్‌లోనే కొనసాగుతారని స్పష్టత వచ్చినట్లయింది.

# రోశయ్య దూరదృష్టి వల్లే మిగులు బడ్జెట్

మొదటి పేజీ రువాయి

ఆర్యవైశ్యులు కలిసికట్టుగా ఉంటేనే బలం

ఆర్యవైశ్యులు ఆర్థిక క్రమశిక్షణ కలిగిన వారన్న రేవంత్ రెడ్డి కాంగ్రెస్ హయాంలో గల్లాపెట్టె వ్యవహారం ఆర్యవైశ్యులకే ఇచ్చామని అన్నారు. ఆర్థికలావాదేవీల్లో సలహాల కోసం ఆర్యవైశ్యులనే అడుగుతారని, సీఎంలు ఎంతమంది మారినా ఆర్థికమంత్రిగా రోశయ్యనే ఉన్నారని, రోశయ్య దూరదృష్టి వల్లే తెలంగాణకు మిగులు బడ్జెట్ వచ్చిందని కొనియాడారు. ఆర్యవైశ్యులు కలిసికట్టుగా ఉంటేనే బలమని సూచించారు. ఆర్యవైశ్యుల బిడ్డ గాంధీ అంటే ప్రపంచంలో తెలియనివారు లేరని, ఆంధ్ర రాష్ట్ర కోసం ప్రాణత్యాగం పొట్టి శ్రీరాములు ఆర్యవైశ్యుడేనని గుర్తు చేశారు.

# భారత్‌పై దాడి చేయాలనే ఆలోచన వస్తే

మొదటి పేజీ రువాయి

గతంలో ఉగ్రవాద దాడులు జరిగినప్పుడు పాకిస్థాన్ భూభాగంలోకి చొరబడి మరీ సమాధానం చెప్పే ప్రధాని భారత్‌కు ఉంటారని ఎవరూ ఊహించలేదని అమిత్ షా అన్నారు. సర్జికల్ స్ట్రైక్, ఎయిర్ స్ట్రైక్ లేదా 'ఆపరేషన్ సిందూర్', ఇలా ఏది తీసుకున్నా, భారత్‌పై దాడి చేయాలనే ఆలోచన చేయడానికి కూడా శత్రువులు వెన్నులో భయం పుట్టేలా చేసే రక్షణ విధానాన్ని నరేంద్ర మోదీ రూపొందించారని అన్నారు. రామ జన్మభూమి ఆలయ నిర్మాణం, కాశీ విశ్వనాథ్ కారిడార్, కేదార్‌నాథ్ పునరుద్ధరణ లేదా 'మహాకాల్ లోక్' నిర్మాణం వంటివి, ఏళ్ల తరబడి ఎవరూ మాట్లాడటానికి కూడా సాహసించని ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేశారని చెప్పారు.మోదీ నాయకత్వంలో దేశంలోని అన్ని రంగాల్లో సంస్కరణలు తీసుకువచ్చారని, 2047 నాటికి దేశం అన్ని రంగాల్లో అన్ని దేశాల కంటే ముందుంటుందనే బలమైన విశ్వాసాన్ని ప్రజలకు కలిగించారని కేంద్ర హోంమంత్రి స్పష్టం చేశారు. 2014లో భారత్? 'ఫ్రాజైల్ ఫైవ్' (బలహీనమైన ఐదు దేశాలు) జాబితాలో ఉండగా, నేడు అగ్రశ్రేణి కలిగిన ఐదు దేశాల్లో ఒకటిగా నిలిచిందని తెలిపారు. నేడు ప్రపంచ దేశాలతో భారత్‌కు ఉన్న రత్నాలు, ఆభరణాల వ్యాపార సంబంధాలకు దాదాపు 6,000 సంవత్సరాల నాటి సుదీర్ఘమైన చరిత్ర ఉందని షా పేర్కొన్నారు. ఆదివారం ముంబయిలో జరిగిన 52వ ఇండియా జెమ్ అండ్ జ్యువెలరీ అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్న షా ఈ మేరకు ప్రసంగించారు.

**'డీకాలనైజేషన్ అంటే గతాన్ని తుడిచిపెట్టడం కాదు'**

డీకాలనైజేషన్ అంటే కేవలం గతాన్ని తుడిచిపెట్టడం మాత్రమే కాదని, సత్యాన్ని భారతీయ కోణంలో ప్రామాణికంగా అందించడమేనని అమిత్ షా స్పష్టం చేశారు. దేశ చరిత్ర, సంప్రదాయాలు, భాషలు, పురావస్తు గ్రంథాలను కాపాడుకోవాలని, అలాగే వాటిని ప్రజల చెంతకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. బ్రిటిష్ వారు జ్ఞానాన్ని, అధికారాన్ని ఒకదానితో ఒకటి ముడిపెట్టారని, ఆ ఫ్రేమ్‌వర్క్ నుంచి జ్ఞానాన్ని విముక్తం చేయడమే ఇప్పుడు మన ముందున్న కర్తవ్యమని షా వ్యాఖ్యానించారు. ఒక దేశం ఎంత శక్తిమంతమైనదైనప్పటికీ, అది తన జ్ఞాపకాలు, చరిత్ర, సంప్రదాయాలు, సంస్కృతి, భాషల, పురాతన గ్రంథాలను కాపాడుకోవడంలో విఫలమైతే ఎక్కువ కాలం మనుగడ సాధించలేదని స్పష్టం చేశారు. ఆదివారం, ముంబయిలోని ఆసియాటిక్ సొసైటీలో 'గణేశ్ జ్ఞానార్థి' ప్రదర్శన ప్రారంభోత్సవంలో ఆయన ఈ మేరకు ప్రసంగించారు.

# బాధ లేదు..కానీ!

మొదటి పేజీ రువాయి

కార్యకర్తలు, మద్దతుదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు."మేము కాంగ్రెస్‌లోనే పుట్టాం, కాంగ్రెస్‌లోనే పెరిగాం. మాకు వేరే పార్టీలోకి వెళ్లాలనే ఆలోచన లేదు" అని కొండా సురేఖ తేల్చిచెప్పారు. గతంలో కొన్ని తప్పనిసరి పరిస్థితుల్లో బీఆర్ఎస్‌లోకి వెళ్లాల్సి వచ్చిందని అన్నారు. తమను ఎవరూ బయటకు పంపలేదని గుర్తుచేశారు. భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ కాంగ్రెస్ టికెట్‌పైనే పోటీ చేస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మంత్రివర్గం నుంచి తనను తొలగించడంపై మాట్లాడుతూ.. పదవి పోయినందుకు వ్యక్తిగతంగా ఎలాంటి బాధ లేదని, కానీ ఎందుకు తొలగించారో కారణం చెప్పకపోవడం ఆవేదన కలిగించిందని అన్నారు. మంత్రి పదవి ఒక అలంకారం మాత్రమేనని, తనకు అప్పగించిన మూడు శాఖలను ఎలాంటి అవినీతికి తావులేకుండా నడిపించానని తెలిపారు.పార్టీ మార్పు ప్రచారం నేపథ్యంలో అధిష్ఠానం నుంచి తనకు ఫోన్లు వచ్చాయని, తాను పార్టీ వీడటం లేదని వారికి స్పష్టం చేశానని సురేఖ వెల్లడించారు. ఈ క్రమంలో తన భర్త కొండా మురళికి త్వరలో పదవి ఇస్తామనే సంకేతాలు కూడా అధిష్ఠానం నుంచి వచ్చాయని ఆమె తెలిపారు. రానున్న ఎన్నికల్లో వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున మళ్లీ గెలిచి, మంత్రిగా తిరిగి వస్తానని విశ్వాసం వ్యక్తం చేశారు. త్వరలో జరగనున్న వరంగల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 24 నుంచి 25 డివిజన్లలో కాంగ్రెస్‌ను గెలిపించడమే తమ లక్ష్యమని ప్రకటించారు.ఈ సందర్భంగా స్థానిక నేతలపై ఆమె పరోక్షంగా విమర్శలు గుప్పించారు. కనీసం కార్పొరేటర్‌గా కూడా గెలవలేని వారు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. వైఎస్ఆర్ మరణం తర్వాత స్థానికంగా ఉన్న కొందరు "గుంటనక్కలు" తమను మోసం చేశారని ఆరోపించారు. అప్పటి మంత్రిని ఓడించేందుకే కేసీఆర్ తనకు వరంగల్ తూర్పు టికెట్ ఇచ్చారని గుర్తుచేశారు. తాము పరకాలను వీడిన తర్వాత చల్లా ధర్మారెడ్డి అక్రమంగా డబ్బు సంపాదించారని కూడా సురేఖ ఆరోపణలు చేశారు.

# వారి గళాన్ని వినిపిస్తున్నాం..

మొదటి పేజీ రువాయి

పెరిగింది. ఎందుకంటే వారి గొంతు ఇక్కడ వినిపిస్తుంది, వారి అనుభవాలను గౌరవిస్తాం. పరిష్కారాలను కేవలం వారి కోసం మాత్రమే కాకుండా, వారితో కలిసి రూపొందిస్తాం. మా భిన్నత్వం, సహకారమే బ్రిక్స్ అసలైన బలం" అని ప్రధాని మోదీ వివరించారు. ఈ వేదికపై విభిన్న దేశాల మధ్య సహకారం ప్రపంచ పురోగతికి, మానవాళి శ్రేయస్సుకు దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యత ప్రాముఖ్యతను ప్రధాని నొక్కిచెప్పారు. "భారతీయ నాగరికతలో ప్రకృతికి తల్లి స్థానం ఇచ్చాం. శతాబ్దాలుగా, అభివృద్ధి, పర్యావరణం అనేవి ఒకదానికొకటి ప్రత్యామ్నాయాలు కాదని, అవి పరస్పర పూరకాలు అనే బలమైన నమ్మకం మాది" అని మోదీ అన్నారు. భవిష్యత్ తరాల పట్ల తమ బాధ్యతను గుర్తిస్తూ మానవాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యతను పాటించడంపై బ్రిక్స్ దృష్టి సారించిందని తెలిపారు.బ్రిక్స్ ఫ్రేమ్‌వర్క్‌లో చేపట్టిన పలు కార్యక్రమాలను ప్రధాని ప్రస్తావించారు. "స్వచ్ఛ ఇంధన వ్యవస్థలను మరింత విశ్వసనీయంగా, సమర్థవంతంగా, అందుబాటులోకి తెచ్చేందుకు స్మార్ట్ గ్రిడ్లు, ఇంధన నిల్వల కోసం 'బ్రిక్స్ డిజిటల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటు చేశాం" అని వెల్లడించారు. అదేవిధంగా, వ్యవసాయం, వాతావరణ మార్పుల అనుసరణ, పర్యావరణ సుస్థిరత వంటి రంగాల్లో సంప్రదాయ జ్ఞానాన్ని ఆధునిక శాస్త్రంతో అనుసంధానించడం ఎంతో ముఖ్యమని అన్నారు. "వ్యవసాయ పర్యావరణం, పునరుత్పాదక వ్యవసాయం కోసం ఏర్పాటు చేసిన సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్.. సంప్రదాయ పరిజ్ఞానాన్ని ఆధునిక విజ్ఞానంతో కలుపుతాయి" అని పేర్కొన్నారు."మనమంతా విభిన్న వాస్తవికతలతో ముడిపడి ఉండవచ్చు, కానీ సహకారంతో కలిసికట్టుగా ఎదుగుతాం, మానవాళి కోసం వికసిస్తాం. మన భిన్నత్వమే మన గుర్తింపుగా, మన సహకారమే మన స్ఫూర్తిగా నిలవాలి. మన పురోగతి సమస్త మానవాళికి సేవ చేయాలి" అంటూ ప్రధాని తన ప్రసంగాన్ని ముగించారు.

# యువతకు భారీ అవకాశాలు

మొదటి పేజీ రువాయి

చేరేలా చూడాలని అధికారులను.. పార్టీ నాయకులను ఆదేశించారు. ఉద్యోగాల కోసం ఆసక్తి ఉన్న నిరుద్యోగులు kodadameghajob-mela.com వెబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ మాట్లాడే హక్కు ఉందని.. అయితే ప్రతిపక్షాలు నోరు జారకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో ప్రాజెక్టుల్లో తగినంత నీరు లేకపోవడంతో కొన్ని ప్రాంతాలకు నీటిని అందించలేకపోతున్నామని పేర్కొన్నారు. కోదాడలో జరగనున్న మెగా జాబ్ మేళాకు మంత్రి శ్రీధర్ బాబు, శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో జాబ్ మేళాను విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రి సూచించారు.

# రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే మా లక్ష్యం: కొండా మురళి

మొదటి పేజీ రువాయి

కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.కొండా మురళి మాట్లాడుతూ.. 'కొండా సురేఖది, నాదీ ఒకే మాట.. మా కూతురిది వేరు మాట. మా కూతురు ప్లాన్ బీ ఏంటో నాకు తెలీదు. మా బిడ్డ వ్యాఖ్యలకు, మాకు సంబంధం లేదు. మా గెలుపు కోసం రాహుల్ గాంధీ పాదయాత్ర చేశారు. అలాంటప్పుడు మేము పార్టీని ఎలా వీడతాం. కృతజ్ఞత అనేది మా రక్తంలో ఉంది. రాహుల్ గాంధీని ప్రధాని చేసేవరకూ పోరాడతాం'.. అని అన్నారు.కొండా సుస్మిత వ్యవహారంపై సురేఖ ఎందుకు స్పందించలేదనే ప్రశ్నకు మురళీ సమాధానమిచ్చారు. 'మా కూతురు మాట్లాడిన మాటలు వ్యక్తిగతం అయినప్పటికీ.. పార్టీకి క్షమాపణలు చెప్పాలని సురేఖకు చెప్పాను. లేదంటే పేపర్ మీద రాసి ఇవ్వాలని బతిమాలాను. కానీ, సురేఖ ఒప్పుకోలేదు'.. అని అన్నారు. 'ఎన్నిరోజులు బ్రతికామనేది కాదు.. ఎలా బ్రతికామనేదే ముఖ్యం. మాట మీద నిలబడి ఉంటాం. పదవులు వస్తాయి, పోతాయి. వ్యక్తిత్వమే మనల్ని కాపాడుతుంది'.. అని కొండా మురళి పేర్కొన్నారు.తాము పదవులను ఆశించి పనిచేసేవాళ్లం కాదని కొండా మురళి అన్నారు. పార్టీలు మారతామన్న వార్తల్లో నిజం లేదని, కాంగ్రెస్‌లో ఉండి ప్రజాసేవ చేసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. 'వైఎస్ చనిపోయాక ఆయనిచ్చిన మంత్రి పదవి వద్దని పావురాల గుట్టలో రాజీనామా పత్రం పడేసి వచ్చాం.. కానీ పదవి కోసం పాకులాడలేదు. నమ్మితే నమ్మకంగా ఉంటాం.. లేదంటే లేదు. కార్యకర్తలే నాబలం, బలహీనత.. ఎక్కడైనా భూకబ్జాకు పాల్పడినట్టు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా'.. అని కొండా మురళి సవాల్ చేశారు.





## వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో,శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి

**జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**

నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం
:వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.విఘ్నాలను తొలగించే ఆది దేవుడైన శ్రీ వినాయకుని ఉత్సవాలను జిల్లా ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో,ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.గణేష్ చతుర్థి పర్వదినం ప్రతి ఇంటా సుఖసంతోషాలు,శాంతి, సౌభాగ్యాలను నింపాలని,గణనాథుని కృపాకటాక్షాలతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆయన అభిలషించారు.అదేవిధంగా వినాయక విగ్రహాల ఏర్పాటులో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.పర్యావరణానికి హాని కలిగించని మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించాలని కోరారు.పండుగల సందర్భంగా పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు.

## విఘ్న గణపతి ఆశీస్సులు అందరిపై ఉండాలి

**ప్రశాంత వాతావరణంలో నవరాత్రి వేడుకలు జరుపుకోవాలి**

**భక్తిశ్రద్ధలతో, ఐక్యతతో పూజలు నిర్వహించుకోవాలి**

**గణేష్ మండపాల వద్ద తగు జాగ్రత్తలు పాటించాలి**

**ప్రజలందరికి వినాయకచవితి శుభాకాంక్షలు**

**మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి**



నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం : విఘ్నాలకు అధిపతి అయిన వినాయకుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మాజీ శాసన సభ్యులు మర్రి జనార్ధన్ రెడ్డి ప్రజలందరికి వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు. ఐక్యతతో పాటు భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో నవరాత్రి వేడుకలను జరుపుకోవాలని కోరారు. ఇకనుండైనా విఘ్నాలన్నీ తొలగి తెలంగాణ సమాజం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఏక దంతుడి దీవెనలతో ప్రజలంతా శాంతి సౌభ్రాతృత్వాలు వెల్లి విరిసేలా గణపతి నవరాత్రోత్సవాలు జరుపు కోవాలని అయన విజ్ఞప్తి చేశారు. వాడవాడలా తొమ్మిది రోజుల పాటు వేడుకలు నిర్వహించుకునేందుకు ఏర్పాటు చేసిన మండపాలవద్ద తగుజాగ్రత్తలు పాటిస్తూ భక్తిశ్రద్దలతో వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు.

## శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ చేసిన మంత్రి ఫరూక్



నంద్యాల,మన ప్రజాపక్షం:
రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆదివారం స్థానిక ఎన్టీఆర్ కాంప్లెక్స్ ఆవరణలో బలిజ సంఘం మరియు కాపు రాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. మంత్రి ఫరూక్ శ్రీకృష్ణదేవరాయలు ప్రజా సంక్షేమం, సాగునీటి రంగంలో చేసిన సంస్కరణలను కొనియాడారు. చెరువులు, కుంటలను తవ్వించి ప్రజల తాగునీటి అవసరాలను తీర్చిన ఆయన గొప్ప చక్రవర్తి అని పేర్కొన్నారు.మంత్రికి చెందిన ప్రత్యేక చొరవ వల్ల దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న విగ్రహావిష్కరణ ఈరోజు సాధ్యమైందని బలిజ సంఘం నేతలు అభినందించారు. సంస్థల నాయకులు, ప్రముఖులు, న్యాయవాది రామచంద్రరావు, టిడిపి యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, శాంతిరాం విద్యాసంస్థల అధినేత శాంతిరాముడు, ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## నాగర్ కర్నూల్ లో దారుణం....
# వివాహేతర సంబంధానికి భర్త బలి

నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం: నాగర్ కర్నూల్ పట్టణంలోని రామ్ నగర్ కాలనీలో ఈనెల 10వ తారీఖున జరిగిన హత్య కేసును నాగర్ కర్నూల్ పోలీసులు చేదించారు. ఈనెల 10వ తారీఖున హోటల్ వ్యాపారి కరీం (43) హత్యకు గురైనట్టు తెలుసుకున్న పోలీసులు విచారణలో పలు ఆసక్తికర విషయాలను కనుగొన్నారు. ఆదివారం నాడు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పి బుర్రి శ్రీనివాస్,సిఐ అశోక్ రెడ్డి ఎస్సై వెంకట్ రెడ్డిలతో కలిసి మీడియాకు వివరాలను వెల్లడించారు. ఈ హత్యకు వివాహేతర సంబంధమే కారణమని తేలడంతో మృతుడి భార్య సలీమా బేగం (36), ఆమె ప్రియుడు ఎండి గౌస్ పాషా (29) లను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. అయితే సలీమా బేగం కు రేవల్లి మండలం నాగపూర్ కు చెందిన టైం పంక్చర్ దుకాణం నిర్వాహకుడు (వరసకు మరిది) గౌస్ పాషా తో గత రెండు సంవత్సరాలుగా అక్రమ సంబంధం ఉన్నట్టు వెల్లడించారు. ఈ విషయం భర్త కరీంకు తెలిసి మందలించడంతో భార్య భర్త మధ్య గొడవలు జరిగాయి. ఇరువురి పెద్దలు పంచాయతీ పెట్టి గౌస్ పాషాను తిట్టడంతో అప్పుడే కరీం ఎలాగైనా చంపేస్తానని బెదిరించాడు.మృతుని పై ఉన్న ఆస్థిని కొంత కాలం క్రితమే భార్య తన పేరున చేయించుకుంది.అయితే తన భర్తను చంపితే ఆస్థి కూడా వస్తుందని ఇద్దరు కలిసి పథకం రచించుకున్నారు. అక్క ప్లాన్ ప్రకారం ఈనెల 7వ తేదీన సలీమా నెల్లూరు దర్గాకు వెళ్ళింది. అనంతరం తన ప్రియుడు గౌస్ పాషా కు వాట్సప్ కాల్ ద్వారా మాట్లాడి తన భర్త కరీంను ఎలాగైనా ఈ రోజే చంపేయాలని చెప్పింది.రాత్రి సమయంలో 2:30 గంటలకు గౌస్ పాషా కత్తి, గ్లౌస్ లతో వచ్చి నిద్ర మత్తులో డోర్ తీసిన కరీం ను అతి దారుణంగా కత్తితో గొంతు కోసి హత్య చేసాడు.హత్యకు ఉపయోగించిన కత్తి, బట్టలు, చెప్పులను దారిలో ముళ్ల పొదల్లో పడవేశాడు. మృతుని తమ్ముడు హుస్సేన్ ఇచ్చిన మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. మొదటగా మృతుని భార్య సలీమా బేగం ను అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం




బయటపడింది. మృతుని భార్య సలీమా బేగంను మరియు ఆమె ప్రియుడు గౌస్ పాషాను పోలీసులు ఆదివారం నాడు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. వారి నుండి హత్యకు ఉపయోగించిన కత్తి, బట్టలు, గ్లౌజులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసును చేదించిన సీఐ అశోక్ రెడ్డి, ఎస్ఐ వెంకటరెడ్డి మరియు వారి సిబ్బందిని డిఎస్పి బుర్రి శ్రీనివాసులు అభినందించారు.

# ప్రభుత్వ ఆస్పత్రిలో ఎంఆర్ఐ స్కానింగ్ యంత్రాన్ని ఏర్పాటు చేయాలి:ఈగం శ్రీనివాస్




జనగామ మన ప్రజాపక్షం:?జనగామ జిల్లా కేంద్రంలో పెద్ద ప్రభుత్వ ఆసుపత్రి ఉన్నప్పటికీ, ప్రజలకు అత్యంత అవసరమైన ఎంఆర్ఐ స్కానింగ్ సౌకర్యం అందుబాటులో లేకపోవడం తీవ్ర విచారకరమని తెలంగాణ ఉద్యమకారుడు, సోషల్ వర్కర్ ఈగం శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ...నిత్యం వందలాదిమంది అనేక రకాల అనారోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యులు ఎంఆర్ఐ స్కానింగ్ అవసరమని ప్రైవేట్ ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నారని తెలిపారు. అయితే, స్థానికంగా ఈ సౌకర్యం లేకపోవడంతో పేషెంట్లు దాదాపు 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న హన్మకొండకు గానీ, లేదా 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న హైదరాబాద్‌కు గానీ వెళ్లాల్సి వస్తోందని ఆయన వివరించారు.జనగామ జిల్లా కేంద్రంతో పాటు చుట్టుపక్కల ఉన్న మూడు నియోజకవర్గాల పేద



ప్రజలకు ఈ ఏరియా ఆసుపత్రే ఏకైక పెద్ద దిక్కుగా ఉందని ఈగం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఆసుపత్రిలో కనీస ఎంఆర్ఐ స్కానింగ్ సదుపాయం లేకపోవడం వల్ల నిరుపేద రోగులు తీవ్ర ఆర్థిక, శారీరక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ?ఈ తీవ్రమైన సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం, వైద్య ఆరోగ్య శాఖ తక్షణమే స్పందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పేద ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని జనగామ జిల్లా ఆసుపత్రిలో వెంటనే ఎంఆర్ఐ స్కానింగ్ యంత్రాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి, జిల్లా డీఎండహెచ్ఓకు మరియు ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు పత్రికా ముఖంగా ఈగం శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

# జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ నూతన కమిటీ నియామకం

**జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ వేముల మల్లేష్ మహారాజ్ ఆధ్వర్యంలో 15 మందికి బాధ్యతలు**

**ఎస్సీ సెల్‌కు నూతన మండల, పట్టణ స్థాయి నాయకుల నియామకం**

జనగామ, మన ప్రజాపక్షం
జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ వేముల మల్లేష్ మహారాజ్ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ కమిటీకి నూతన నియామకాలు చేపట్టారు. జిల్లా ఎస్సీ సెల్ కమిటీని మరింత బలోపేతం చేయడంతో పాటు,పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా నిర్వహించేందుకు అదనపు వైస్ చైర్మన్లు, జనరల్ సెక్రటరీలు, అధికార ప్రతినిధి, సెక్రటరీలు, జాయింట్ సెక్రటరీలను నియమించారు. ఈ నియామకాలు ఆదివారం (13 సెప్టెంబర్ 2026) నుంచి తక్షణమే అమల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.జిల్లా ఎస్సీ సెల్ కమిటీకి నూతనంగా నియమితులైన వారి వివరాల ప్రకారం వైస్ చైర్మన్ గా ఉడుగుల ఉషారాణి (మహిళ), వైస్ చైర్మన్ గా బొండుగుల కొమురయ్య, జనరల్ సెక్రటరీలుగా తాళ్లపల్లి అనిల్ కుమార్, గొల్లూరి పృథ్వీరాజ్, మోతె జనార్ధన్, మాతంగి కొమురయ్య,పులి శోభన్ బాబు, అధికార ప్రతినిధిగా గొల్లూరి రమేష్, సెక్రటరీలుగా ఎడ్ల సారంగపాణి, రామగల్ల వెంకటేష్, మారపాక యాదయ్య,గాదెపాక ప్రసాద్, జాయింట్ సెక్రటరీలుగా సాదువ్యాల సాంబరాజు, ములుగూరి వంశీ, కల్లెపు శ్రీకాంత్ లను నియమించారు.



**మండల, పట్టణ అధ్యక్షుల నియామకం**

జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్‌ను క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంతో పాటు, ఎస్సీ వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేసే విధంగా నూతన మండల, పట్టణ స్థాయి నాయకులకు బాధ్యతలు అప్పగించారు.బచ్చన్నపేట మండల చైర్మన్ గా పాకాల చిరంజీవి, జనగామ పట్టణ చైర్మన్ గా ముస్త్యాల చందర్,జనగామ పట్టణ వైస్ చైర్మన్ గా గంగనాపు జితేందర్, జనగామ పట్టణ వైస్ చైర్మన్ గా(మహిళా) రామగల్ల నాగరాణి లను నియమించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ వేముల మల్లేష్ మహారాజ్ మాట్లాడుతూ నూతనంగా నియమితులైన నాయకులు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ఎస్సీ వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్‌ను గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసి, పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.వైటీడీఏ మెంబర్ డాక్టర్ లక్ష్మీ నారాయణ నాయక్ మాట్లాడుతూ



కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్‌కు నూతనంగా నియమితులైన నాయకులకు అభినందనలు తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఎస్సీ వర్గాల అభ్యున్నతి కోసం సమష్టిగా పనిచేయాలని సూచించారు. నూతన బాధ్యతలు స్వీకరించిన నాయకులు ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతనంగా నియమితులైన నాయకులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వైటీడీఏ మెంబర్ డాక్టర్ లక్ష్మీ నారాయణ నాయక్, డీసీసీ ఉపాధ్యక్షుడు నూకల బాల్ రెడ్డి, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు జాయ మల్లేష్, పాకాల చిరంజీవి, డీసీసీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ లింగాల రాజేందర్ రెడ్డి, ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ కళ్యాణం సమ్మయ్య, అల్వాల రమేష్, రామగాళ్ల కృష్ణ, దండు శ్రీనివాస్, సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల వెంకట్ రెడ్డి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్
# ఆధ్వర్యంలో వినాయక శోభయాత్ర

మఖ్తల్, మన ప్రజాపక్షం :మక్తల్ పట్టణంలో సోమవారం రోజు "వినాయక చవితి" పర్వదినం సందర్భంగా విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో వినాయక శోభాయాత్ర నిర్వహించడం జరుగుతుంది. ఈ వినాయక శోభాయాత్ర ఉదయం 8:30 నిమిషములకు శ్రీ పడమటి ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలోని సీతారామ కళ్యాణ మండపం నుండి ప్రారంభమవుతూ ఆజాద్ నగర్ మీదుగా విశ్వకర్మ ఇంటి వరకు కొనసాగును. కావున ఇట్టి వినాయక శోభయాత్ర కార్యక్రమంలో గౌరవ ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల ప్రముఖులు, నాయకులు, వివిధ ధార్మిక సంస్థల సభ్యులు, వివిధ వినాయక ఉత్సవ కమిటీల సభ్యులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల సభ్యులు, వివిధ భజన మండలిల సభ్యులు, వివిధ స్వచ్ఛంద సంస్థల సభ్యులు, వర్తక వాణిజ్య వ్యాపారస్తులు,మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం జయప్రదం చేయగలరని భక్తులకు కోరారు.ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ రాకుండా అద్యక్షులు కే.సత్యనారాయణ గౌడ్,పట్టణ అధ్యక్షుడు వాకిటి భీమన్న, గౌరవ అధ్యక్షులు జుట్ల హనుమంతు, నారాయణపేట జిల్లా బజరంగ్ దళ్ కో- కన్వీనర్ భీమేష్, ప్రఖండ సంయోజక్ రాహుల్,మండల సహ సంయోజక్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# నూతన మార్కెట్‌లో సకల సౌకర్యాలు

## వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలి





జనగామ, మన ప్రజాపక్షం: జనగామ మున్సిపాలిటీ పరిధిలోని సంజయ్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన మార్కెట్ యార్డును ఆదివారం జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ మరియు మున్సిపల్ కమిషనర్ చిమ్ముల రాజశేఖర్ రెడ్డి సంయుక్తంగా సందర్శించి మార్కెట్‌లో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెట్‌లో వ్యాపారులు, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, లైటింగ్, మరుగుదొడ్లు మరియు ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. మార్కెట్‌ను పరిశుభ్రంగా, సౌకర్యవంతంగా నిర్వహించే విధంగా మున్సిపల్ సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. సంజయ్‌నగర్ నూతన మార్కెట్‌లో కూరగాయలు, పండ్లు, పూలు, వెజ్ మరియు నాన్‌వెజ్ వ్యాపారాల నిర్వహణకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తూ మార్కెట్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడానికి మున్సిపాలిటీ చర్యలు చేపడుతోంది. వ్యాపారులు నూతన మార్కెట్‌కు సులభంగా తరలివచ్చి ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ వ్యాపారాలను నిర్వహించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ మరియు కమిషనర్ అధికారులకు సూచించారు. గత నెల రోజులుగా వ్యాపారులకు మార్కెట్‌లోని సౌకర్యాలపై అవగాహన కల్పిస్తూ, నూతన మార్కెట్‌కు తరలివచ్చేలా మున్సిపల్ సిబ్బంది నిరంతరం చర్యలు చేపడుతున్నారు. ప్రజలు కూడా నూతన మార్కెట్‌కు వచ్చి కూరగాయలు, పండ్లు, పూలు మరియు ఇతర నిత్యావసర వస్తువులను కొనుగోలు చేసి నూతన మార్కెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపాలిటీ విజ్ఞప్తి చేస్తోంది. నూతన మార్కెట్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన అనంతరం రోడ్లపై, వీధుల్లో మరియు ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగించే విధంగా అనధికారికంగా వ్యాపారాలు నిర్వహించకుండా అందరూ మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించిన సందర్భంలో మున్సిపల్ నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోబడతాయి. సంజయ్‌నగర్ నూతన మార్కెట్‌ను ప్రజలకు ఉపయోగకరమైన, పరిశుభ్రమైన మరియు సౌకర్యవంతమైన మార్కెట్‌గా అభివృద్ధి చేయడానికి మున్సిపాలిటీ నిరంతరం కృషి చేస్తుందని చైర్‌పర్సన్ మరియు కమిషనర్ తెలిపారు.

# వినాయక చతుర్థి సందర్భంగా 'మన ప్రజాపక్షం' ప్రత్యేక కథనం

### మంతటి నారాయణ, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత

మన ప్రజాపక్షం డెస్క్:
భారతీయుల అతిముఖ్య పండగలలో ఇది ఒక పండగ. పార్వతి పరమేశ్వరుల కుమారుడైనా వినాయకుని పుట్టినరోజునే వినాయక చవితిగా జరుపుకుంటారన్నారు. భాద్రపద మాసము శుక్ల చతుర్థి మధ్యాహ్న శుభ సమయంలో హస్త నక్షత్రం రోజున చవితి ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. చరిత్ర:- 1892లో ప్రజా వ్యతిరేక అసెంబ్లీ చట్టం ద్వారా హిందూ సమావేశాలపై బ్రిటిష్ వారు నిషేధాన్ని విధించారన్నారు. భారతీయ స్వాతంత్ర సమరయోధుడు లోకమాన్య తిలక్ బ్రిటీష్ వారిపై భారత స్వాతంత్రోద్యమము మద్దతుగా ప్రజలందరిలో జాతీయ స్ఫూర్తి రగిలించే ఏ చిన్న అవకాశాన్ని వదిలిపెట్టలేదన్నారు. దేశవ్యాప్తంగా అందరినీ ఒక్కటి చేసే సంకల్పంతో ఇప్పుడు నిరంతరంగా సాగుతున్న గణపతి ఉత్సవాలు, శివాజీ ఉత్సవాలు మొదటిసారిగా ప్రారంభించి సాధించాడు. భారతీయుల పూజా మందిరాలలో జరిగే గణేష్ పూజకు సామూహికమైన, సామాజికమైన, సార్వ జననీనమైన ప్రాధాన్యత అందించడంలో అతను చేసిన కృషి అనన్య సామాన్యం. విఘ్నేశ్వరుని కథ :-సూత మహాముని శౌనకాది మహామునులకు విగ్నేశ్వరుని కథ ఇలా చెప్పారన్నారు. పూర్వము గజరూపము కల రాక్షసుడు ఒకడు పరమ శివుని కొరకు ఘోరమైన తపస్సు చేశారన్నారు. అతని తపస్సును మెచ్చి భక్త సులబడైన పరమేశ్వరుడు ప్రత్యక్షమై భక్త నీ కోరిక ఏమి అని అడగగా, ఆ రాక్షసుడు స్వామి నీవు ఎల్లప్పుడూ నా ఉదరమునందే నివసించాలన్నారు. శివుడు అతని కోరికను మన్నించి గజాసురుని కడుపులో ప్రవేశించి నివసించ సాగాడన్నారు. కొద్ది రోజులకు పార్వతి దేవికి ఈ విషయము తెలిసి చాలా విచారించి మహావిష్ణువుని ప్రార్థించి ఓ దేవదేవ ఇంతకుముందు కూడా మీరే నా భర్తను యుక్తితో బస్మాసూరుని భారి నుంచి కాపాడారన్నారు. ఇప్పుడు కూడా మీరే ఏదైనా ఉపాయంతో మహాశివుని కాపాడవలసిందని వేడుకొందన్నారు. శ్రీహరి ఆమెకు ధైర్యం చెప్పి పంపించారన్నారు. శ్రీహరి గంగిరెద్దు మేలయే సరైన ఉపాయంగా తలచి నందీశ్వరుని గంగిరె ద్దుగా, బ్రహ్మాది దేవతలను వివిధ వాద్యకారులుగా మార్చి గజాసురుని పురానికి వెళ్లి సన్నాయి వాయిస్తూ నందిని ఆడించారన్నారు. దానికి తన్మయుడైన గజా సూరుడు మీకేం కావాలో కోరుకోండి అనగా విష్ణుమూర్తి ఇది మహా మైన నందీశ్వరుడు శివుని వెతుక్కుంటూ వచ్చింది. కాబట్టి నీ దగ్గర ఉన్న శివుడిని ఇచ్చేయి అని అడిగాడట. వెంటనే ఆ కోరిక కోరింది వేరెవరో కాదు సాక్షాత్తు శ్రీహరి విష్ణువే అని గ్రహించాడన్నారు. నా చర్మం నీ వస్త్రంగా ధరించుకో ధరించమని వేడుకొన్నాడట. అభయమిచ్చిన తర్వాత విష్ణుమూర్తి నందికి సైగ చేయగా తన కొమ్ములతో గజా సూరు ని చీల్చి చంపాడన్నారు. బయటకు వచ్చిన శివుడు శ్రీహరిని స్తుతించాడు. అప్పుడు విష్ణుమూర్తి ఇలా అప్రదానము చేయకూడదన్నారు. దుష్టులకు ఇలాంటి వరాలిస్తే పాముకు పాలు పోసి పెంచినట్లు అవుతుందని చెప్పి అంతరార్ధ మయ్యాడన్నారు.



**వినాయక జననము**

జననము:- కైలాసంలో పార్వతి దేవి శివుని రాక గురించి విని చాలా సంతోషించి తల స్థానం చేయుటకై నలుగు పెట్టుకుంటూ ఆ నలుగుతో ఒక బాలుని రూపాన్ని తయారుచేసి ఆ బొమ్మకు ప్రాణం పోసి ద్వారం వద్ద కాపలాగా ఉంచి ఎవరిని రానివ్వద్దని చెప్పిందన్నారు. ఆ బాలుడు సాక్షాత్తు పరమేశ్వరుని ఎదుర్కొని తల్లి ఆనతిని నెరవేర్చాడట. ఆ ధిక్కారానికి కోపం వచ్చినా పరమశివుడు అతని శిరచ్ఛేదనము గావించి లోపలికి వెళ్ళాడట. అప్పటికే పార్వతీదేవి స్నానము ముగించి చక్కగా అలంకరించుకొని పతిదేవుని రాకకై ఎదురుచూస్తుందన్నారు. శివునికి ఎదురెళ్లి ప్రియ సంభాషణలు చేస్తుండగా ద్వారం దగ్గర ఉన్న బాలుని విషయము వచ్చిందన్నారు. శివుడు చేసిన పని విని ఎంతో దుఃఖించగా శివుడు కూడా చింతించి గజాసూరుని శిరస్సును అతికించి ఆ బాలుని బ్రతికించారన్నారు. అందువల్ల గజానుడుగా పేరు పొందారన్నారు. అతని వాహనముఅనింద్యుడు అనే ఎలుక. గజానునుడు తల్లిదండ్రులను భక్తి శ్రద్ధలతో కొలిచేవాడన్నారు. కొన్నాళ్లకు పార్వతీ పరమేశ్వరులకు కుమార స్వామి పుట్టాడు. అతని వాహనము నెమలి. అతను మహాబలిశాలి అన్నారు.








# పారిశుద్ధ్య కార్మికులు,మున్సిపల్ సిబ్బందికి వైద్య శిబిరం

జనగామ, మన ప్రజాపక్షం:
జనగామ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు మరియు మున్సిపల్ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ వైద్య శిబిరానికి మున్సిపాలిటీలోని మొత్తం 183 మంది సిబ్బందికి గాను 163 మంది సిబ్బంది హాజరయ్యారు. హాజరైన సిబ్బందికి సమగ్ర హెల్త్ చెకప్ నిర్వహించడంతో పాటు అవసరమైన రక్త నమూనాలు మరియు ఇతర వైద్య పరీక్షల కోసం నమూనాలు సేకరించడం జరిగింది. మున్సిపల్ సిబ్బంది ఆరోగ్యాన్ని క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ, వారి ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ చిమ్ముల రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ చిమ్ముల రాజశేఖర్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ డా. అనురాధ జాదవ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపయ్య, జవాన్లు, వార్డు అధికారులు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.




# ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిపై నిరాధార ఆరోపణలు

### మంత్రి పొంగులేటి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్

జనగామ,మన ప్రజాపక్షం:
అసెంబ్లీ వేదికగా జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డిపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని బీఆర్ఎస్ పార్టీ జనగామ పట్టణ యూత్ అధ్యక్షుడు ఉల్లెంగుల సందీప్ మండిపడ్డారు. బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో ఉండి ఎలాంటి ఆధారాలు లేకుండా ఇష్టానుసారంగా మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. మంత్రి పొంగులేటి చేసిన ఆరోపణలపై తక్షణమే స్పందించి, వాటికి సంబంధించిన నిజమైన ఆధారాలను బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఒకవేళ ఆధారాలు చూపించలేని పక్షంలో జనగామ ప్రజలకు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి మంత్రి బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని స్పష్టం చేశారు. నిజం ఎప్పటికైనా గెలుస్తుందని, ఇలాంటి నిరాధార ఆరోపణలను జనగామ ప్రజలు మరియు బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా తిప్పికొడతాయని ఉల్లెంగుల సందీప్ హెచ్చరించారు.

# నేడు నిర్వహించనున్న పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం తాత్కలిక రద్దు

### జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్




నంద్యాల, మన ప్రజాపక్షం :నంద్యాల జిల్లా బొమ్మలసత్రం వద్దగల జిల్లా పోలీస్ కార్యాలయంలో 14.09.2026 ( సెప్టెంబర్ 14 సోమవారం) జరగబోయే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంను తాత్కలికంగా రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు (సెప్టెంబర్ 14)వినాయక చవితి ప్రభుత్వ సెలవు దినం కావడం వలన సోమవారం 14.09.2026 న జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమం వాయిదా పడిందని తెలిపారు.కావున జిల్లా ప్రజలు సుదూర ప్రాంతాల నుండి వ్యయ, ప్రయాసలతో జిల్లా ఎస్పీ పిజిఆర్ఎస్ కార్యక్రమంకు రావొద్దని, ప్రజలు (ఫిర్యాదుదారులు) ఈ విషయాన్ని గమనించగలరని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.వచ్చే సోమవారం(సెప్టెంబరు 21) నుండి పిజిఆర్ఎస్ కార్యక్రమం యధావిధిగా కోనసాగుతుందని తెలిపారు.




## ప్రగతి యూత్ రాయల్ యూత్ ఆధ్వర్యంలో కోలాహలంగా గణేష్ ఆగమనం

జనగామ, మన ప్రజాపక్షం:
జనగామ పట్టణ పరిధిలోని 8వ వార్డులో ప్రగతి యూత్ మరియు రాయల్ యూత్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గణపతి ఆగమన మహోత్సవాన్ని ఎంతో ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ వేడుకకు స్థానిక వార్డు ప్రజలతో పాటు యువత భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి 8వ వార్డు కౌన్సిలర్ సందుపట్ల మంజుల ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. స్వామివారి ఆశీస్సులతో పట్టణ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో విలసిల్లాలని ఆకాంక్షించారు. ప్రతి ఏటా ఉత్సవాలను ఎంతో నియమ నిష్టలతో, బాధ్యతాయుతంగా నిర్వహిస్తున్న ప్రగతి యూత్ మరియు రాయల్ యూత్ సభ్యులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ఆధ్యాత్మిక శోభతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రగతి యూత్ మరియు రాయల్ యూత్ కమిటీ ప్రతినిధులు, సభ్యులు మరియు వార్డు నాయకులు, కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





## నాయినోనిపల్లి మైసమ్మ దేవస్థానంలో ఆర్టీఐ దరఖాస్తు

### టీఆర్పీ జిల్లాఅధ్యక్షులు ఆంజనేయులు

నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం
:పెద్దకొత్తపల్లి మండలంలో ఉన్నా నాయినోనిపల్లి మైసమ్మ దేవస్థానం నిర్వహణ, ఆదాయ-వ్యయాలు, ఆలయ ఆస్తులు, విరాళాలు, టెండర్లు, నిర్మాణ పనులు మరియు ఇతర పరిపాలనా అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో సమాచార హక్కు చట్టం--2005 (ఆర్టీఐ యాక్ట్ -2005) కింద సంబంధిత ప్రజా సమాచార అధికారికి (పిఐఓ)దరఖాస్తు తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాగర్ కర్నూలు జిల్లా అధ్యక్షులు బీసం ఆంజనేయులు సమర్పించడం జరిగింది. దేవస్థానంలో అభివృద్ధి పనులు పారదర్శకంగా జరగాలిని, దేవస్థానానికి సంబంధించిన ప్రభుత్వ/ప్రజా రికార్డుల్లో ఏవైనా అవకతవకలు ఉన్నాయా లేదా అనే విషయాన్ని వాస్తవ రికార్డుల ఆధారంగా తెలుసుకోవడమే ఈ ఆర్టీఐ దరఖాస్తు ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రజల నమ్మకానికి సంబంధించిన దేవస్థానాల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజాధనం సక్రమ వినియోగం ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆర్టీఐ యాక్ట్ ప్రకారం కోరిన సమాచారాన్ని నిర్ణీత గడువులో అందించాలని సంబంధిత అధికారులను కోరారు.

## ఎన్ఎస్ యూఐ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా జంగ్మే రామ్ రతన్



కుబీర్,మన ప్రజాపక్షం:కుబీర్ మండలంలోని సాప్లి గ్రామానికి చెందిన జంగ్మే రామ్ రతన్ తెలంగాణ రాష్ట్ర ఎన్ఎస్ యూఐ (నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా) జాయింట్ సెక్రటరీగా నియమితులయ్యారు. అఖిల భారత విద్యార్థి కాంగ్రెస్ కమిటీ (ఎన్ఎస్ యూఐ) రాష్ట్ర కమిటీని బలోపేతం చేసే దిశగా నూతన కార్యవర్గాన్ని ప్రకటించిన జాబితాలో ఆయనను ఈ కీలక బాధ్యతలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రామ్ రతన్ మాట్లాడుతూ గుర్తించి ఈ పదవి అప్పజెప్పిన రాష్ట్ర కమిటీకి, స్థానిక ఎమ్మెల్యే మంత్రులకు, సీఎం రేవంత్ రెడ్డికి రుణపడి ఉంటానని అన్నారు. అలాగే విద్యార్థుల సమస్యపై ఎప్పటికప్పుడు పోరాడుతూ వారి సమస్యల పరిష్కారం దిశగా సాగుతానని అన్నారు. స్థానిక రాష్ట్ర నాయకులను కలుపుకొని పోతూ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చే ఏ పోరాటంలో అయినా ముందుంటానని అన్నారు.

# శ్రీ ఉమామహేశ్వర దేవస్థానం అభివృద్ధిని చూసి ఓర్వలేకనే అసత్య ఆరోపణలు

**భక్తుల సౌకర్యార్థం కొరకు కొండపైకి ప్రత్యేక బస్సులు**

**ఎక్కడ కూడా అవినీతి అక్రమాలకు తావు లేకుండా పూర్తిగా ఆన్లైన్ సర్వీస్**

**నల్లమల దేవాలయ పర్యాటక ప్రాంతం అభివృద్ధికి అందరూ సహకరించాలి**

**ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ సహకారంతో ఉమామహేశ్వర దేవాలయం మరింతగా అభివృద్ధి**

**దేవాలయాలపై అనవసర అసత్య ఆరోపణలు చేస్తే తగిన బుద్ధి చెప్తారు భక్తులు**

అచ్చంపేట, మన ప్రజాపక్షం :
శ్రీ ఉమామహేశ్వర దేవస్థానం పాలకమండలి సభ్యులు దాశరథి పవన్,గండికోట దశరథం,మంత్రు నాయక్,కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతల రాజగోపాల్,ఎల్లికంటి శ్రీనివాసులు ఆదివారం నాడు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ పేరుతో కొంతమంది వ్యక్తులు నాయకులుగా చలామణి అవుతూ, శ్రీ ఉమామహేశ్వర దేవస్థానం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక అనవసరమైన, అసత్య ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సహకారంతో దేవస్థానం చైర్మన్ బిరం మాధవరెడ్డి ఆధ్వర్యంలో శ్రీ ఉమామహేశ్వర దేవస్థానంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి శ్రీ ఉమామహేశ్వర దేవస్థానం అభివృద్ధికి సుమారు రూ.4 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నవి పేర్కొన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో పలు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యంగా కొండపై ఉన్న దేవాలయానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, దీనిపై కూడా కొంతమంది కావాలనే అనవసర రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం వద్ద ఆన్లైన్ సేవలు, దేవాదాయ శాఖకు సంబంధించిన సేవలు, ఇతర మౌలిక వసతులు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. దేవస్థానం చైర్మన్ బిరం మాధవరెడ్డి ఆలయ అభివృద్ధినే ప్రధాన లక్ష్యంగా చేసుకుని అనునిత్యం పనిచేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణతో పాటు ఎంపీ, మంత్రులు, ప్రభుత్వ శాఖల సహకారంతో దేవస్థానాన్ని మరింత అభివృద్ధి చేసి,ఉమామహేశ్వరాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. బస్సుల ఏర్పాటు, టికెట్ల విషయంలో కొంతమంది కావాలనే ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. భక్తుల సౌకర్యం కోసం చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. భక్తులు నుంచి వచ్చినటువంటి విరాళాలను ఆన్లైన్లో నమోదు చేసి వారికి రసీదు ఇవ్వడం జరుగుతుందన్నారు. అంతా పక్కా పారదర్శకంగా ఉందన్నారు. ప్రజలకు వాస్తవాలను వివరించి తప్పుడు ప్రచారాన్ని తిప్పికొడతామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శివ, వినోద్, వెంకటేష్, అంజి తదితరులు పాల్గొన్నారు.



# వికారాబాద్ జిల్లా కేంద్రంలో బాలుర గిరిజన స్టూడెంట్ మేనేజ్మెంట్ హాస్టల్ ఏర్పాటు చేయాలి

### ఎం.ధర్మనాయక్, రాష్ట్ర అధ్యక్షులు

వికారాబాద్,మన ప్రజాపక్షం:
వికారాబాద్ జిల్లా వెంకటాపూర్ తండాలో తెలంగాణ గిరిజన సంఘం మూడవ జిల్లా మహాసభ ఉత్సాహ పూరితంగా జరిగింది. దీనికి అధ్యక్షతగా జాటోత్ శ్రీను వ్యవహరించగా ముఖ్య అతిథులుగా తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.ధర్మనాయక్ మాట్లాడుతూ వికారాబాద్ లో దాదాపుగా 15 హాస్టళ్లలో ఉన్న కాలేజీ విద్యార్థుల కోసం స్టూడెంట్ మేనేజ్మెంట్ హాస్టల్ లేకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరం అయ్యే ప్రమాదం ఉందదని వారు అన్నారు. ప్రభుత్వాలు మారుతున్న హామీలు అట్లే ఉన్నాయని వారు అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం గిరిజన విద్యార్థులను గుర్తించి వికారాబాద్ జిల్లా కేంద్రంలో గిరిజన స్టూడెంట్ మేనేజ్మెంట్ హాస్టల్ ను ఏర్పాటు చేసి జరిగిన విద్యార్థులకు విద్యను అందించాలని వారు అన్నారు. వికారాబాద్ లో ప్రైవేట్ కాలేజీలు అధికంగా ఉన్నాయని చుట్టుపక్కల మండి గిరిజనులు అధిక సంఖ్యలో విద్యను అభ్యసిస్తున్న వారికి వసతి గృహం లేకపోవడంతో అనేక రకాలుగా ఇబ్బందులు పడుతూ రూమ్ రెంటు కడుతూ డబ్బులు లేక అవస్థలు పడుతున్నారని వారు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం




జిల్లా కేంద్రంలో గిరిజన స్టూడెంట్ మేనేజ్మెంట్ హాస్టల్ లేకపోవడం అంటే గిరిజనులకు విద్యకు దూరం చేయడమే అని వారు అన్నారు. పాలకులకు ముందు చూపు లేకపోవడంతో ఈ ప్రాంతంలో ఎక్కువ మంది విద్యార్థులు వలసలు వెళ్లి చదువు కుంటున్నారని,విద్యార్థులకు వసతి సౌకర్యం రాష్ట్ర ప్రభుత్వం కల్పించాలని లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన పోరాటాలు నిర్వహించాల్సి వస్తుందని వారు అన్నారు. ఈ ప్రాంతంలో లంబాడి, చెంచు, ఎరుకల ఇతర గిరిజన తెగలు ఉన్నారని వారి విద్యను ఆటంక పరచకుండా సౌకర్యం కల్పించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మెగావత్



వెంకట్, రాములు, శ్రీను, దశరథం, రామచందర్, శివాజీ, శ్రావణ్ వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు. అనంతరం తెలంగాణ గిరిజన సంఘం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జాటోత్ శ్రీను నాయక్, ప్రధాన కార్యదర్శిగా మెగావత్ వెంకట్ రాములు, ఉపాధ్యక్షులుగా కె.సంజీవ్, డి.గణేష్,ఈ.లక్ష్మణ్,సహాయ కార్యదర్శిగా వి.రామచందర్, కె.శ్రావణ్, కె.రవి, కె.రాజు, కోశాధికారిగా జై చౌహన్, ఎం.ప్రియాంక, కమిటీ సభ్యులుగా ఎన్ లక్ష్మణ్, మమత, శ్రీను, కె.రవి, ఏ.కిషన్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయింది.

# పోలీస్ అధికారుల 'పల్లె నిద్ర' కార్యక్రమం

**శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజారోగ్యం, భద్రతపై అవగాహన సదస్సులు**

నంద్యాల, మన ప్రజాపక్షం :గ్రామీణ ప్రాంత ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం, శాంతిభద్రతలను పర్యవేక్షించడం మరియు నేరాల నియంత్రణే లక్ష్యంగా నిన్న రాత్రి(13.09.2026) నంద్యాల జిల్లాలోని పలు సబ్ డివిజన్లలో ఎస్ఐ, సీఐ స్థాయి పోలీస్ అధికారులు 'పల్లె నిద్ర' (నైట్ హాల్ట్) కార్యక్రమాన్ని నిర్వహించారు. సంజామాల పోలీస్ స్టేషన్ ఎస్సై ఆకుమళ్ళ గ్రామంలో పల్లె నిద్ర నిర్వహించి ప్రజలతో సమావేశమయ్యారు. గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నందికొట్కూరు టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై నందికొట్కూరు టౌన్ లోని మారతి నగర్ ఏరియా లో వార్డ్ నిద్ర నిర్వహించి ప్రజలతో సమావేశమయ్యారు. గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నంద్యాల తాలూకా పోలీస్ స్టేషన్ ఎస్సై ఫ్యాక్షన్ గ్రామమైన ఎన్ కొత్తపల్లి గ్రామంలో రాత్రి బస చేసి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాల నివారణ: ద్విచక్ర వాహనదారులు ప్రయాణించే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే అనుమానాస్పద ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకు వివరాలు గానీ, ఓటీపీలు గానీ ఎవరికీ చెప్పకుండా వెంటనే కాల్ కట్ చేయాలని స్పష్టం




చేశారు. యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల వల్ల కలిగే శారీరక, మానసిక, చట్టపరమైన నష్టాలను వివరించారు. గ్రామంలో ఎవరైనా వీటి రవాణా లేదా వినియోగానికి పాల్పడితే పోలీసులకు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పరిస్థితులు ఎదురైనా లేదా అనుమానాస్పద వ్యక్తులు సంచరించినా వెంటనే డయల్ 112




లేదా స్థానిక పోలీసు స్టేషన్‌కు తెలియజేయాలని కోరడమైనది. ప్రజలకు పరిపాలనను చేరువ చేసే పల్లె నిద్ర కార్యక్రమాల ప్రాధాన్యత గురించి కలెక్టర్ పల్లె నిద్ర ఇనిటీటేటివ్ ద్వారా తెలుసుకోవచ్చు. ఈ వీడియో ఆంధ్రప్రదేశ్‌లో అధికారులు నేరుగా గ్రామాలకే వెళ్లి ప్రజలతో మమేకమయ్యే క్షేత్రస్థాయి కార్యక్రమాల ఉద్దేశాన్ని చక్కగా వివరిస్తుంది.

# ఘనంగా సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమం


బిజినపల్లి, మన ప్రజాపక్షం :బిజినపల్లి మండల కేంద్రంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా సేవా సంకల్ప్ అభియాన్ కన్వీనర్ నాగేందర్ గౌడ్ హాజరయ్యారు. బిజినపల్లి మండల సేవా సంకల్ప్ అభియాన్ కన్వీనర్ కురవి శ్రీకాంత్ శర్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి నాగేందర్ గౌడ్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్ సెప్టెంబర్ 17వ తేదీ నుండి అక్టోబర్ 17వ తేదీ వరకు నెల రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాసేవ, సామాజిక సేవ, సంక్షేమం, ఆరోగ్యం, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలకు సంబంధించిన వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ప్రజలకు సేవ



చేయడమే ప్రధాన లక్ష్యంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో ప్రజలను కలిసి, కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా అందుతున్న ప్రయోజనాలను వివరించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు చేరేలా కృషి చేయాలని సూచించారు. అలాగే పార్టీ సిద్ధాంతాలను, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, వివిధ సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలతో మరింత సన్నిహిత సంబంధాలను ఏర్పరచుకోవాలని కార్యకర్తలకు సూచించారు. మండల కన్వీనర్ కురవి శ్రీకాంత్ శర్మ మాట్లాడుతూ బిజినపల్లి మండలంలో సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని కోరారు. పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని, ప్రజా సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సేవే లక్ష్యం-సమాజ అభివృద్ధే సంకల్పం అనే స్ఫూర్తితో సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాలను బిజినపల్లి మండలంలో మరింత విస్తృతంగా నిర్వహించాలని నాయకులు, కార్యకర్తలు సంకల్పించారు. ఈ కార్యక్రమంలో మండల సేవా సంకల్ప్ అభియాన్ కో-కన్వీనర్లు, జిల్లా కార్యదర్శి చంద్రకళ పాల్గొన్నారు.






# నాగల్ కర్నూల్ జిల్లాలో ఘరానా మోసం

- ప్రముఖ మీడియా సంస్థ పేరుతో డబ్బుల వసూళ్లు....!
- మీడియా పేరుతో వసూళ్లు.... పరేషాన్ లో స్థానిక జర్నలిస్టులు
- రెడ్ హ్యాండెడ్ పట్టుకున్న 'మన ప్రజాపక్షం' జిల్లా ప్రతినిధి తుమ్మోజు శివకృష్ణ
- గట్టిగా నీలదీసే వరకు పారిపోయిన వైనం

**నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం:**నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో మరియు జిల్లా వ్యాప్తంగా పలు మండల కేంద్రాలలో ప్రముఖులను,అధికారులను, నాయకులను బెదిరిస్తూ, మీ అక్రమాలు మా దగ్గర ఉన్నాయంటూ డబ్బులు ఇవ్వకపోతే మీ చిట్టా బయట పెడతానంటూ, మా మీడియా సంస్థలో మీ గురించి,మీ అక్రమాల గురించి ప్రసారాలు చేస్తామంటూ పట్టణంలోనే కాకుండా జిల్లాలోని అనేక మండల కేంద్రాలలో అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న ప్రముఖ మీడియా సంస్థకు చెందిన 'రిపోర్టర్ ను' చాకచక్యంగా పట్టుకొని నిలదీయగా అతడు అక్కడ నుంచి పారిపోయాడు. ఏకంగా ఓ ప్రముఖ దినపత్రికలో పని చేస్తున్న జిల్లా ప్రతినిధి ఇంటికి వెళ్లి వారి మామను డబ్బులు అడిగి అసలు చేస్తున్న క్రమంలో అనుమానం వచ్చి ఆ వ్యక్తి వారి అల్లుడు అయినటువంటి 'మన ప్రజాపక్షం' జిల్లా ప్రతినిధి తుమ్మోజు శివకృష్ణకు సమాచారం చేరవేయగా, వెంటనే ఎక్కడికి చేరుకున్న 'మన ప్రజాపక్షం' జిల్లా ప్రతినిధి తుమ్మోరు శివకృష్ణ ఆ మీడియా సంస్థకు చెందిన వ్యక్తి యొక్క ఐడెంటిటీ కార్డును పరిశీలించగా అతను తడబడుతూ  మీడియా పేరుతో అనాథల కోసం చందా వసూలు చేస్తున్నామని తప్పుడు సమాచారం ఇవ్వగా, అనుమానం వచ్చి గట్టిగా నిలదీయగా అతడు అక్కడ నుంచి పరిగెట్టుకుంటూ పారిపోయాడు. ఆ మీడియా సంస్థకు చెందిన  కొంతమందిని జర్నలిస్ట్ లను సంప్రదించగా, మునిపట్టిలో ఆ మీడియా సంస్థలు ఈ వ్యక్తి పనిచేసినట్టు, ఇలాగే పలమార్లు పలువురు బెదిరించి అక్రమంగా వసూళ్లకు పాల్పడినప్పుడు, అతడిని ఆ మీడియా సంస్థ నుంచి తీసివేసినట్టు సమాచారం ఇచ్చారు. అయినప్పటికీ ఆ వ్యక్తి ఆ మీడియా సంస్థను ఉపయోగించుకుంటూ, ఆ మీడియా సంస్థ యొక్క ఐడెంటిటీ కార్డును తన సొంతంగా నకిలీ "ఐడెంటిటీ కార్డును" సృష్టించుకుని పలువురు ప్రముఖులను, రాజకీయ నాయకులను, అధికారులను బెదిరిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్టు తెలిసింది. త్వరలో ఇలాంటి వారిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేయనున్నట్టు తుమ్మోజు శివకృష్ణ తెలిపారు. మీడియా పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే మీడియా పేరు చెప్పినప్పుడు వారి యాజమాన్యాలను సంప్రదించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు. వారు వాడే ఐడెంటిటీ కార్డులు నిజమైనవా? లేక నకిలీవా? అని తెలుసుకోవాలని సూచించారు. ఇలాంటి వారిపై పోలీసు శాఖ ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలని కోరారు.







# నేర ప్రవృత్తిని వీడి సత్ప్రవర్తనతో జీవించాలి

## చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

నంద్యాల, మన ప్రజాపక్షం :నంద్యాల జిల్లా వ్యాప్తంగా రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులకు పోలీసుల కౌన్సెలింగ్ నిర్వహించారు. నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు జిల్లాలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా పోలీసు యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతోంది.ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో నివసిస్తున్న రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, చెడు నడత కలిగిన వ్యక్తులను పోలీసు అధికారులు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఇకపై ఎటువంటి నేరాలకు పాల్పడకుండా, నేరప్రవృత్తికి స్వస్తి పలికి సత్ప్రవర్తనతో జీవించాలని పోలీసులు సూచించారు. చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉంటూ సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా జీవించాలని హితవు పలికారు.అనంతరం వారి ప్రస్తుత జీవన విధానం, కుటుంబ పరిస్థితులు, జీవనోపాధి కోసం నిర్వహిస్తున్న వృత్తులు తదితర వివరాలను పోలీసు అధికారులు అడిగి తెలుసుకున్నారు. చట్టబద్ధమైన జీవనోపాధిని కొనసాగిస్తూ ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని సూచించారు.రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులు ఇకపై ఎటువంటి అసాంఘిక లేదా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా పోలీసుల నిరంతర నిఘా ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు.పోలీసుల సూచనలు, హెచ్చరికలను పట్టించుకోకుండా తిరిగి నేరాలకు లేదా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే బైండోవర్ కేసులు నమోదు చేయడంతో పాటు, అవసరమైన సందర్భాల్లో పీడీ యాక్ట్ కింద కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, నేర నియంత్రణలో భాగంగా పోలీసులు చేపడుతున్న చర్యలకు ప్రజలు సహకరించాలన్నారు.






# క్యాంపస్ ప్లేస్‌మెంట్లకు ఏఐ ఎఫెక్ట్.. ఐఐఎస్సీ ప్రొఫెసర్ కీలక ప్రశ్న!

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో యూనివర్సిటీ విద్య భవిష్యత్తుపై 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్' (ఐఐఎస్సీ) ప్రొఫెసర్ డాక్టర్ ప్రతోష్ కీలక ప్రశ్న లేవనెత్తారు. రాబోయే ఐదేళ్ల నుంచి పదేళ్లలో కంపెనీలు క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌ను గణనీయంగా తగ్గిస్తే.. యూనివర్సిటీ విద్య ఉద్దేశం ఏమిటన్నది విద్యార్థులు ఆలోచించాలని సూచించారు.ప్రస్తుతం ఏఐతో కోడింగ్, డేటా విశ్లేషణ, రిపోర్టుల తయారీ, పరిశోధన వంటి పనులను వేగంగా చేయగలుగుతున్నారు. దీంతో గతంలో జూనియర్ ఉద్యోగులు చేసిన కొన్ని పనులకు ఇక ఎక్కువ మంది సిబ్బంది అవసరం లేకపోవచ్చు. ఫలితంగా ఫ్రెషర్ల నియామకాలు తగ్గే అవకాశం ఉందన్నది ఆయన ఆందోళన.భారత్‌లో ఉన్నత విద్య నుంచి ఉద్యోగ జీవితంలోకి అడుగుపెట్టేందుకు క్యాంపస్ ప్లేస్‌మెంట్లు కీలక మార్గంగా ఉన్నాయి. అయితే ఏఐ సాయంతో తక్కువ మంది ఉద్యోగులతోనే ఎక్కువ పని పూర్తి చేయగలిగితే.. కంపెనీలు గతంలో మాదిరిగా పెద్ద సంఖ్యలో కొత్త ఉద్యోగులను తీసుకోకపోవచ్చు.ఉదాహరణకు గతంలో 100 మంది చేయాల్సిన పనిని ఏఐ సాయంతో 50 మందితోనే పూర్తి చేయగలిగితే.. కొత్త నియామకాలు తగ్గే అవకాశం ఉంటుంది. అయితే క్యాంపస్ ప్లేస్‌మెంట్లు పూర్తిగా కనుమరుగవుతాయని దీని అర్థం కాదు. మారుతున్న ఉద్యోగ మార్కెట్‌కు అనుగుణంగా విద్యార్థులను ఎలా సిద్ధం చేయాలన్న ప్రశ్న మాత్రం ముందుకొస్తుంది.ఏఐ కారణంగా విద్యార్థులు నేర్చుకోవాల్సిన నైపుణ్యాల్లోనూ మార్పులు రావచ్చని ప్రొఫెసర్ అభిప్రాయం. సమాచారం వెతకడం, అర్థం చేసుకోవడం, పనిలో ఉపయోగించడం వంటి వాటిలో ఏఐ ఇప్పటికే సాయం చేస్తోంది. దీంతో సరైన ప్రశ్నలు అడగడం, ఏఐ ఇచ్చే సమాచారాన్ని పరిశీలించడం, దాన్ని ఉపయోగించి సమస్యలకు పరిష్కారాలు కనుగొనడం వంటి నైపుణ్యాలకు ప్రాధాన్యం పెరగొచ్చు.అయితే ఏఐ వాడకం పెరగడంతో యూనివర్సిటీ డిగ్రీల విలువ తగ్గిపోదని నిపుణుల అభిప్రాయం. ప్రయోగశాలలు, అధ్యాపకులు, పరిశోధన ప్రాజెక్టులు, ఇతర విద్యార్థులతో కలిసి పనిచేసే అవకాశాలు యూనివర్సిటీల్లో లభిస్తాయి. ఇవి ఉద్యోగానికి అవసరమైన సమాచారాన్ని నేర్చుకోవడానికి మించిన అనుభవాన్ని అందిస్తాయి.భవిష్యత్తులో యూనివర్సిటీల దృష్టి ఉద్యోగం సంపాదించడానికే పరిమితం కాకుండా పరిశోధన, సమస్యల పరిష్కారం, ప్రయోగాలు, కొత్త సాంకేతికతలతో కలిసి పనిచేసే సామర్థ్యంపై ఉండాల్సిన అవసరం రావచ్చన్నది ఈ చర్చ సారాంశం. రాబోయే ఐదేళ్ల నుంచి పదేళ్లలో క్యాంపస్ నియామకాలు ఎంతమేర తగ్గుతాయన్నది ఇప్పుడే చెప్పలేం. కానీ ఏఐ మారుతున్న కొద్దీ విద్యా విధానం కూడా మారాల్సిన అవసరం ఉందన్న ప్రశ్న మాత్రం గట్టిగా వినిపిస్తోంది.



# కీలక సమయంలో సౌదీకి పాక్ ధోకా.. ఇప్పుడు డ్యామేజ్ కంట్రోల్‌కు యత్నాలు!

యెమెన్‌లో హౌతీ దాడులు పెరుగుతున్నాయి. సౌదీ అరేబియా భద్రతపై ముప్పు ముదురుతోంది. ఇలాంటి కీలక సమయంలో పాకిస్థాన్ మాత్రం వెనక్కి తగ్గిన సంకేతాలు కనిపిస్తున్నాయి. సౌదీపై దాడి జరిగితే తమ రక్షణ ఒప్పందం అమల్లోకి వస్తుందని తొలుత పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ చెప్పినా.. ఇప్పుడు ఇస్లామాబాద్ మాట మార్చింది. ఆ ఒప్పందం వల్ల హౌతీలపై పాక్ సైన్యం తప్పనిసరిగా యుద్ధంలోకి దిగాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. దీంతో సౌదీతో సంబంధాలపై ప్రశ్నలు మొదలయ్యాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రధాని షెహబాజ్ షరీఫ్ రంగంలోకి దిగారు.



మాట మార్చిన పాక్

సౌదీపై హౌతీల దాడులు కొనసాగితే మక్కా సంయుక్త రక్షణ ఒప్పందం అమల్లోకి వస్తుందని గత వారం పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ప్రకటించారు. యెమెన్‌లో జరుగుతున్న పోరు సౌదీకి విస్తరిస్తే ఒప్పందం పనిచేస్తుందని చెప్పారు.కానీ ఆ తర్వాత ఇస్లామాబాద్ వివరణ ఇచ్చింది. సౌదీ, పాకిస్థాన్, టర్కీ మధ్య కుదిరిన మక్కా రక్షణ ఒప్పందం ప్రధానంగా రక్షణ కోసమేనని తెలిపింది. దీని వల్ల హౌతీలపై నేరుగా సైనిక చర్య చేపట్టాల్సిన బాధ్యత పాక్‌కు లేదని స్పష్టం చేసింది.ఈ ప్రకటన సౌదీ ఇబ్బందికరమైన పరిస్థితుల్లో ఉన్నప్పుడు రావడం గమనార్హం. యెమెన్‌లో హౌతీలు కీలక ప్రాంతాలను స్వాధీనం చేసుకుంటున్నారు. ఎర్ర సముద్రం నుంచి బాబ్ అల్-మండెబ్ జలసంధి వరకు పరిస్థితి వేడెక్కుతోంది.

సౌదీ యువరాజుకు షరీఫ్ ఫోన్

పాక్ వైఖరిపై సందేహాలు మొదలైన వెంటనే షెహబాజ్ షరీఫ్ సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. హౌతీ దాడులను తీవ్రంగా ఖండించారు. సౌదీ రాజ కుటుంబానికి, ప్రజలకు పాకిస్థాన్ పూర్తి మద్దతు ఉంటుందని చెప్పారు.హౌతీల దాడులు ప్రాంతీయ శాంతి, భద్రతకు ముప్పుగా మారాయని షరీఫ్ పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ఇంధన సరఫరాలపైనా ప్రభావం పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు.తాను, పాక్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్, ఉప ప్రధాని ఇషాక్ దార్ కలిసి ఉద్రిక్తతలను తగ్గించేందుకు ప్రయత్నిస్తామని షరీఫ్ తెలిపారు. సౌదీ యువరాజు కూడా పాకిస్థాన్ మద్దతును ప్రశంసించినట్లు షరీఫ్ కార్యాలయం వెల్లడించింది.

యెమెన్‌లో అసలు సమస్య ఇదే

యెమెన్‌లో హౌతీలు, సౌదీ మద్దతున్న ప్రభుత్వ బలగాల మధ్య పోరు తీవ్రంగా మారింది. హౌతీలు ఎర్ర సముద్రంలోని కీలక ఓడరేవు మొఖాను స్వాధీనం చేసుకున్నారు. బాబ్ అల్-మండెబ్ జలసంధికి సమీపంలోని ఓ ద్వీపంపైనా పట్టు సాధించారు.ఆదివారం సౌదీ మద్దతున్న బలగాలు మొఖా, ధుబాబ్, తైజ్ ప్రావిన్స్‌లోని ఇతర ప్రాంతాల్లో హౌతీ స్థావరాలపై దాడులు చేశాయి. హౌతీలు సౌదీ వైపు దాడులు చేశారు. 2022లో ఐక్యరాజ్యసమితి మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ తర్వాత ఈ స్థాయిలో పోరు మళ్లీ జరగడం ఇదే మొదటిసారి. సెప్టెంబరు ఆరంభం నుంచి 82 వేల మందికి పైగా ప్రజలు ఇళ్లను వదిలి వెళ్లినట్లు సమాచారం.

సౌదీకి మరో వైపు అమెరికా

యెమెన్ పోరు ముదరడంతో సౌదీ అరేబియా అమెరికా మద్దతును కూడా కోరుతోంది. అయితే హౌతీలపై నేరుగా అమెరికా సైనిక చర్య చేపట్టేందుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సిద్ధంగా లేరు. దీంతో సౌదీకి భద్రత విషయంలో మరో అనిశ్చితి ఎదురైంది.ఒకవైపు అమెరికా వెనకడుగు.. మరోవైపు పాకిస్థాన్ సైనిక చర్యపై స్పష్టత ఇవ్వకపోవడం.. సౌదీకి పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చాయి. దీంతో తన భద్రతా భాగస్వాములు అవసరమైన సమయంలో ఎంతవరకు అండగా నిలుస్తారన్నది రియాద్‌కు కీలక ప్రశ్నగా మారింది.

ట్రంప్‌తో షరీఫ్ భేటీ

ఈ పరిణామాల మధ్య షెహబాజ్ షరీఫ్ త్వరలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కలవనున్నారు. సెప్టెంబరు 23న న్యూయార్క్‌లో జరిగే ఐక్యరాజ్యసమితి సాధారణ సభ సందర్భంగా ఈ భేటీ జరగనున్నట్లు సమాచారం.అదే రోజు ట్రంప్, మెలానియా ట్రంప్ నిర్వహించే విందుకు కూడా షరీఫ్‌కు ఆహ్వానం అందినట్లు తెలుస్తోంది. ఈ భేటీ పాకిస్థాన్‌కు కీలకంగా మారనుంది.అమెరికా, సౌదీతో సంబంధాలను సమతూకం చేసుకుంటూనే.. యెమెన్ సంక్షోభంలో తన వైరిని ఎలా సమర్థించుకోవాలన్నది ఇప్పుడు పాకిస్థాన్‌కు పెద్ద సవాల్. సౌదీకి ఇచ్చిన రక్షణ హామీని మాటల్లోనే కాకుండా అవసరమైనప్పుడు ఎలా నిలబెడుతుందన్నదే అసలు ప్రశ్న.

## స్నేహితుడి భార్యతో వివాహేతర సంబంధం..

# బీజేపీ నేత మేనల్లుడి దారుణ హత్య

తన భార్యతో వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో బీజేపీ నాయకుడి మేనల్లుడిని అతడి స్నేహితుడే కిరాతకంగా హత్య చేశాడు. హరియాణాలోని రేవారి జిల్లాలో జరిగిందీ ఘటన.పోలీసుల కథనం ప్రకారం.. సెప్టెంబర్ 7న రేవారి జిల్లాలోని హెచ్‌పీసీఎల్ రిఫైనరీ సమీపంలో జితేంద్ర (40) మృతదేహం రక్తపు మడుగులో పడి ఉంది. తలపై బలమైన గాయాలు ఉండటంతో హత్యగా నిర్ధారించిన పోలీసులు, జితేంద్ర మామ, బీజేపీ నేత ఉత్తమ్ సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. తన భార్యతో జితేంద్రకు అక్రమ సంబంధం ఉందనే అనుమానంతో అతడి స్నేహితుడు ప్రవీణ్ అలియాస్ పప్లా ఈ హత్యకు పక్కా ప్రణాళిక రచించాడు.



సెప్టెంబర్ 7న బీర్ పార్టీ పేరుతో జితేంద్రను ప్రవీణ్ బయటకు పిలిచాడు. ఇద్దరూ కలిసి మద్యం తాగిన తర్వాత,హెచ్‌పీసీఎల్ రిఫైనరీ సమీపంలోని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లాడు. అక్కడ కారు దిగిన జితేంద్రపై వెనుక నుంచి ఇనుప రాడ్‌తో పలుమార్లు దాడి చేసి చంపేశాడు. ఈ సమయంలో ప్రవీణ్ మేనల్లుడు అమన్ చుట్టూ కాపలా కాశాడు. ఈ దాడి మొత్తం సమీపంలోని సీసీటీవీ కెమెరాలో రికార్డయింది.సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించిన పోలీసులు.. జర్తాల్ సమీపంలో ప్రవీణ్, అమన్‌లను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ప్రవీణ్ నేరం అంగీకరించాడని, తన భార్యపై అనుమానంతోనే హత్య చేసినట్లు ఒప్పుకున్నాడని ఏఎస్పీ దీపికా అగర్వాల్ తెలిపారు. మొదట రూ.40 లక్షల అప్పు వివాదం కారణంగా హత్య జరిగిందని ప్రచారం జరిగినా, వివాహేతర సంబంధంపై అనుమానమే ప్రధాన కారణమని పోలీసులు స్పష్టం చేశారు. నిందితులిద్దరినీ కోర్టు మూడు రోజుల పోలీస్ రిమాండ్‌కు పంపింది. హత్యకు వాడిన ఆయుధం, వాహనం కోసం దర్యాప్తు కొనసాగుతోంది.

# నా భూమి కబ్జా చేశారు.. సీబీఐ విచారణ జరపండి: ప్రధాని మోదీకి క్లాస్‌మేట్ ఫిర్యాదు



దశాబ్దాల నాటి భూవివాదంలో తనకు న్యాయం చేయాలంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాఠశాల స్నేహితుడు ఆయనను ఆశ్రయించారు. మహారాష్ట్రలోని మీరా-భయందర్‌లో బీజేపీ ఎమ్మెల్యేతో సంబంధం ఉన్న బిల్డర్లు ఫోర్జరీ పత్రాలతో తన భూమిని కబ్జా చేశారని, ఈ వ్యవహారంపై సీబీఐ విచారణ జరిపించాలని ఆయన కోరారు. ప్రధాని జోక్యంతో ఈ కేసులో స్థానిక యంత్రాంగం కదిలింది.వివరాల్లోకి వెళితే.. గుజరాత్‌లోని వడ్‌నగర్‌లో ప్రధాని మోదీతో కలిసి బీఎన్ స్కూల్‌లో చదువుకున్న 81 ఏళ్ల అస్గరాలీ వోహ్రా, సెప్టెంబర్ 8న ప్రధానిని కలిసి తన గోడు వెళ్లబోసుకున్నారు. 1989లో భయందర్ ఈస్ట్‌లోని నవఘర్ రోడ్‌లో తాను 2,810 చదరపు మీటర్ల స్థలాన్ని చట్టబద్ధంగా కొనుగోలు చేశానని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ భూమిని తాను ఎన్నడూ అమ్మలేదని, బదిలీ చేయలేదని స్పష్టం చేశారు.అయితే, 2011లో స్వయం బిల్డర్స్ అనే సంస్థతో కుమ్మక్కై కొందరు ఫోర్జరీ పత్రాలు సృష్టించారని వోహ్రా ఆరోపించారు. తనకు తెలియకుండానే తన ఆస్తిని రెండు భాగాలుగా విభజించి, ఒక భాగాన్ని స్వయం బిల్డర్స్‌కు, మరో భాగాన్ని సెవెన్ ఎలెవెన్ కన్‌స్ట్రక్షన్స్‌కు అప్పగించారని తెలిపారు. ఈ సెవెన్ ఎలెవెన్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థకు స్థానిక బీజేపీ ఎమ్మెల్యే నరేంద్ర మెహతాతో సంబంధాలున్నాయని ఆయన ఆరోపించారు. తన యాజమాన్య హక్కులను పట్టించుకోకుండా, వివాదాస్పద భూమిలో నిర్మాణానికి మీరా-భయందర్ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగం అనుమతులు ఇచ్చిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ అధికారులు కుమ్మక్కై నిందితులకు సహకరించారని ఆరోపించారు.ఈ ఫోర్జరీపై 2015లో వోహ్రా ఎఫ్ఐఆర్ నమోదు చేయగా, కేసు కోర్టుకు చేరింది. అయితే, ఎఫ్ఐఆర్ దాఖలు చేసిన దాదాపు 11 ఏళ్ల తర్వాత, 2026లో సీఐడీ నివేదిక సమర్పించడంపై ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. రాజకీయ ఒత్తిళ్ల వల్లే దర్యాప్తులో జాప్యం జరిగిందని ఆరోపించారు. అంతేకాకుండా తన వాదన వినే అవకాశం ఇవ్వకుండా 2025లో తనపైనే కౌంటర్ కేసు పెట్టారని తెలిపారు.ఏళ్ల తరబడి అధికారుల చుట్టూ తిరిగినా న్యాయం జరగకపోవడంతో, వోహ్రా నేరుగా ప్రధాని మోదీని కలిసి ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాలని కోరారు. బిల్డర్లు, ప్రభుత్వ అధికారుల పాత్రపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానితో వోహ్రా భేటీ అనంతరం ఈ విషయంలో కదలిక వచ్చింది. స్థానిక మున్సిపల్ అధికారులు సెప్టెంబర్ 16న విచారణకు తేదీని ఖరారు చేసి, సంబంధిత కంపెనీల ప్రతినిధులు హాజరుకావాలని ఆదేశాలు జారీ చేశారు.

మన ప్రజాపక్షం

## విఘ్నేశ్వరుడికి విశ్వవ్యాప్త కీర్తి..

# ఏ దేశంలో ఏ పేరుతో కొలుస్తారంటే..!

**భారత్‌లోనే కాకుండా అనేక ఆసియా దేశాల్లో విఘ్నేశ్వరుడికి పూజలు**

**థాయ్‌లాండ్, జపాన్, ఇండోనేషియా వంటి దేశాల్లో భిన్న రూపాల్లో ఆరాధన**

**ఆయా దేశాల్లోని స్థానిక సంప్రదాయాలు, మతాలతో వినాయకుడు మమేకం**

**అదృష్టం, జ్ఞానం, సంపదకు ప్రతీకగా పలు దేశాల్లో గణపతికి పూజలు**

**కొన్ని దేశాల్లో బౌద్ధమతంలోనూ గణేశుడికి ప్రత్యేక స్థానం**



విఘ్నాలు తొలగించే దేవుడిగా, జ్ఞానానికి, సంపదకు అధిపతిగా హిందువులు ఆరాధించే గణపతి పూజలు కేవలం భారత్‌కే పరిమితం కాలేదు. ఆసియాలోని అనేక దేశాల్లో అక్కడి సంస్కృతులు, సంప్రదాయాలకు అనుగుణంగా వినాయకుడిని విభిన్న రూపాల్లో, పేర్లతో కొలుస్తున్నారు.

గజముఖుడైన గణేశుడు భారతదేశంలో ప్రతి హిందూ కుటుంబంలో, ఆలయంలో నిత్య పూజలు అందుకుంటాడు. ముఖ్యంగా వినాయక చవితి పండుగను దేశవ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటారు. ఏ శుభకార్యం ప్రారంభించినా ముందుగా గణపతిని ప్రార్థించడం హిందూ సంప్రదాయం.

నేపాల్‌లో గణేశుడికి ప్రత్యేక స్థానం

భారత్‌కు పొరుగున ఉన్న నేపాల్‌లోనూ గణేశుడి ఆరాధన ప్రముఖంగా కనిపిస్తుంది. పండుగల సమయంలో, కొత్త పనులు ప్రారంభించే ముందు వినాయకుడిని పూజిస్తారు. ముఖ్యంగా దసరా (దశైన్) ఉత్సవాల్లో గణపతికి ప్రత్యేక స్థానం ఉంది. అనేక ఆలయాల్లో ఆయన విగ్రహాలు దర్శనమిస్తాయి.

థాయ్‌లాండ్‌లో 'ఫ్రా ఫికానెట్' పేరుతో..

ఆగ్నేయాసియా దేశాల్లో గణపతి ఆరాధన స్థానిక మతాలతో మమేకమైంది. థాయ్‌లాండ్‌లో 'ఫ్రా ఫికానెట్' పేరుతో పిలుచుకునే వినాయకుడిని అదృష్టాన్ని, విజయాన్ని ప్రసాదించే దేవతగా భావిస్తారు. దేశవ్యాప్తంగా ఆయనకు ప్రత్యేక ఆలయాలు ఉన్నాయి.

కంబోడియాలో సంపద, కార్యసిద్ధికి ప్రతీకగా గణపతి

కంబోడియాలోని అంగ్‌కోర్ వాట్ వంటి ప్రాచీన దేవాలయాల్లో గణేశుడి శిల్పాలు నేటికీ కనిపిస్తాయి. ఇక్కడ ఆయనను సంపద, కార్యసిద్ధికి ప్రతీకగా కొలుస్తారు.

బాలిలో విఘ్నేశ్వరుడు జ్ఞానానికి చిహ్నం

ఇండోనేషియా, ముఖ్యంగా బాలిలో, గణేశుడిని జ్ఞానానికి చిహ్నంగా ఆరాధిస్తారు. శతాబ్దాల నాటి చారిత్రక విగ్రహాలు ఇక్కడ ఉన్నాయి. ఒకానొక సమయంలో ఇండోనేషియా కరెన్సీ నోటుపై కూడా గణపతి చిత్రం ఉండటం విశేషం. వియత్నాంలో చం జాతి ప్రజలు వ్యవసాయంలో సమృద్ధి కోసం గణేశుడిని పూజిస్తారు.

జపాన్‌లో 'కంగితేన్' పేరుతో వినాయకుడి ఆరాధన

తూర్పు ఆసియా దేశాల్లోనూ గణపతి ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. జపాన్‌లో 'కంగితేన్' అనే పేరుతో వినాయకుడిని ఆరాధిస్తారు. దేశవ్యాప్తంగా సుమారు 250 బౌద్ధ దేవాలయాల్లో కంగితేన్‌కు పూజలు జరుగుతాయి. సంతోషం, సౌభాగ్యం, మంచి సంబంధాలు ప్రసాదించే దేవుడిగా జపనీయులు ఆయనను నమ్ముతారు.

మయన్మార్‌లో అడ్డంకులను తొలగించే దేవుడిగా గణపతి

మయన్మార్‌లోని శ్వేసాండ పగోడా వంటి బౌద్ధ క్షేత్రాల్లోనూ గణపతికి స్థానం కల్పించారు. అడ్డంకులను తొలగించే దేవుడిగా బౌద్ధ ఆచారాల్లోనూ ఆయనను స్మరించుకుంటారు.

చైనాలో సంపదకు చిహ్నంగా లంబోదరుడు

చైనాలోని కొన్ని ప్రాంతాల్లో గణపతిని సంపదకు చిహ్నంగా భావించి స్థానిక ఆచారాల్లో భాగంగా పూజిస్తారు.

మంగోలియా, టిబెట్‌లలో అదృష్టాన్నిచ్చే దేవుడిగా గణేశుడు

మంగోలియా, టిబెట్‌లలోని బౌద్ధమతంలో రక్షకుడిగా, అదృష్టాన్నిచ్చే దేవుడిగా వినాయకుడికి ప్రాధాన్యత ఇస్తారు. టిబెటన్ బౌద్ధంలో ఆయనను 'వినాయక' పేరుతోనూ పిలుస్తారు.

ఇలా దేశం, సంస్కృతి, పేరు, ఆరాధన విధానం మారినప్పటికీ, అడ్డంకులను తొలగించి, శుభాలను కలిగించే శక్తిగా గణపతిపై ఉన్న నమ్మకం ఆసియా అంతటా ఒకేలా కనిపిస్తుంది. ఇది ఒకే దైవం వివిధ సంస్కృతులలో ఎంతగా ఆదరణ పొందిందో తెలియజేస్తుంది.

# రూ.2 కోట్ల సినిమాకు రూ. 100 కోట్ల ఓటీటీ డీల్!-నిర్మాత రియాక్షన్ ఇదే

2026 బాక్సాఫీస్ సెన్సేషన్ మూవీ 'హనుమాన్ అంశ్'పై కాసుల వర్షం కురుస్తూనే ఉంది. తాజాగా ఈ సినిమా రూ.200 కోట్ల క్లబ్?లోనూ చేరింది. దీంతో మరిన్ని రికార్డులు బ్రేక్ అయ్యాయి. ఈ క్రమంలో ఈ సినిమా ఓటీటీ డీల్?పై ఓ క్రేజీ ప్రచారం జరుగుతోంది. ఈ సినిమా కోసం ఒక ఓటీటీ సంస్థ రూ.100 కోట్ల ఆఫర్ చేసిందని, మేకర్స్ కూడా నెంబర్ నచ్చడంతో డీల్ ఫిక్స్ చేసుకున్నారని ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో ఓటీటీ డీల్ వ్యవహారంపై చిత్ర సహ నిర్మాత రాగిణి సోనా స్పందించారు. ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని ఆమె తెలిపారు.'హనుమాన్ అంశ్? చిత్రానికి రూ. 100 కోట్ల ఓటీటీ డీల్ కుదిరిందన్న వార్తల్లో నిజం లేదు. అలాంటి అబద్ధపు ప్రచారాన్ని పట్టించుకోకండి. ఈరోజు థియేటర్లలో ఎంతమంది సినిమా చూస్తున్నారన్నదే ముఖ్యం. అంతేకానీ, ఓటీటీ డీల్ గురించి లేదా ఏ ప్లాట్?ఫామ్ ఆఫర్ ఇచ్చిందన్న విషయాన్ని ఎవరూ. ప్రేక్షకులు మా సినిమాను థియేటర్లలో చూసి ఆస్వాదించాలని మేం కోరుకుంటున్నాము"ఆఫర్లు వస్తుంటాయి, పోతుంటాయి. కానీ మా టీమ్? తరపున ఒక విషయం స్పష్టం చేయాలనుకుంటున్నా. మాకు ఏ ఓటీటీ నుంచి కూడా ఎలాంటి ప్రతిపాదన రాలేదు. ఇప్పటికిప్పుడు మేం ఓటీటీ డీల్ సెట్ చేసుకోవాలని కూడా మేం కోరుకోవడం లేదు. ఏ నిర్ణయం తీసుకున్నా, టీమ్?తో చర్చించి మాత్రమే తీసుకుంటాం. దీనిపై త్వరలోనే మీకు ఆ విషయం తెలుస్తుంది. ప్రస్తుతానికైతే సినిమాను థియేటర్లలో చూడండి. ఎందుకంటే ఇది ఓటీటీలోకి ఎప్పుడు వస్తుందో మాకు కూడా తెలియదు'అని సహ నిర్మాత రాగిని సోన రీసెంట్?గా జాతీయ మీడియాతో మాట్లాడుతూ క్లారిటీ ఇచ్చారు. కాగా, ఆగస్టు 7న రిలీజైన ఈ సినిమా రీసెంట్?గా రూ.200 కోట్ల మార్క్ అందుకుంది. దీంతో ఈ ఏడాది అత్యధిక లాభాలు అందుకున్న భారతీయ సినిమాగా రికార్డు కొట్టింది.సినిమా కలెక్షన్స్?పై నిర్మాత అనుప్రియ ఇటీవల ఇంట్రెస్టింగ్ వ్యాఖ్యలు చేశారు. 'సినిమా తీసేటప్పుడు బాక్సాఫీసు కలెక్షన్ల గురించి ఆలోచించలేదు. కేవలం నీమ్ కరోలి బాబా స్టోరీని జెన్?జీకి ?చూపించాలనేదే నా ఉద్దేశం. మూవీకి వస్తున్న భారీ కలెక్షన్స్ చూస్తుంటే ఆశ్చర్యం వేస్తోంది. నా వయసు 21 ఏళ్లే. ఈ డబ్బుతో ఏం చేయాలో తెలియడం లేదు. ఈ సినిమా ద్వారా వచ్చిన లాభాలను పేద పిల్లల చదువులకు, స్వచ్ఛంద సేవా కార్యక్రమాలకు ఉపయోగించాలనుకుంటున్నాను' అని అనుప్రియ అన్నారు.మరోవైపు ఈ చిత్రం ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను అలరించడానికి రెడీ అయింది. 'హనుమాన్ అంశ్' తెలుగు వెర్షన్ సెప్టెంబరు 18న థియేటర్స్‌లో విడుదల కానుంది. డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ ఈ మూవీని సమర్పకునిగా వ్యవహరిస్తున్నారు.

హనుమాన్ అంశ్ స్టోరీ ఇదే!

మహారాజ్ నీమ్ కరోలి బాబా జీవితం, బోధనల నుంచి ప్రేరణ పొందిన దర్శకుడు విశాల్ చతుర్వేది 'హనుమాన్ అంశ్' ఒక ఆధ్యాత్మిక డ్రామాగా తెరకెక్కించారు. ఇందులో శోభినవ్ సత్య నీమ్ కరోలి బాబా పాత్రను పోషించగా, విహాన్ షెడ్గే కీలక పాత్రలో కనిపించారు. ఈ చిత్రంలో చందన్ ఆనంద్, పూర్ణిమా తివారీ, అనిల్ కె. రస్తోగి, గుల్షన్ పాండే ఆయా పాత్రలు పోషించారు.



## భారత్-ఆఫ్ఘన్ మ్యాచ్‌లో సరికొత్త అధ్యాయం..
# జనగణమనకు ముందు వందేమాతరం

భారత క్రికెట్ చరిత్రలో ఒక కొత్త అధ్యాయం మొదలైంది. ఆదివారం ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో భారత్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య జరిగిన తొలి టీ20 మ్యాచ్‌కు ముందు అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. ఇరు దేశాల జాతీయ గీతాలు ఆలపించడానికి ముందుగా, భారత జాతీయ గేయమైన 'వందేమాతరం'ను తొలిసారిగా ఒక అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లో ప్లే చేశారు.మ్యాచ్ ప్రారంభానికి ముందు ఇరు జట్ల ఆటగాళ్లు మైదానంలో వరుసలో నిలబడగా, మొదట వందేమాతరం గీతాన్ని వినిపించారు. ఆ తర్వాత భారత జాతీయ గీతం 'జనగణమన', అనంతరం ఆఫ్ఘనిస్థాన్ జాతీయ గీతాన్ని ఆలపించారు. జాతీయ గేయం ఆలపించే విషయంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ (వీనా) ఇటీవల జారీ చేసిన కొత్త మార్గదర్శకాల ప్రకారమే ఈ మార్పు చోటుచేసుకుంది.అధికారిక కార్యక్రమాల్లో జాతీయ గేయాన్ని ఎలా ఆలపించాలనే దానిపై కేంద్ర హోం శాఖ గత నెలలో సమగ్ర మార్గదర్శకాలను విడుదల చేసింది. దీని ప్రకారం, అధికారిక కార్యక్రమాల్లో జాతీయ గీతానికి ముందుగా 190 సెకన్ల నిడివి గల వందేమాతరం పూర్తి గీతాన్ని ఆలపించాలని ఆదేశించింది. ఈ గీతం ప్లే అవుతున్నప్పుడు అందరూ గౌరవ సూచకంగా నిలబడాలని కూడా స్పష్టం చేసింది. 2026 ఆగస్టు 1న ఎర్రకోటపై ప్రధాని



ప్రసంగం తర్వాత తొలిసారిగా వందేమాతరం పూర్తి గీతాన్ని ఆలపించారు.బంకించంద్ర ఛటర్జీ రచించిన ఈ గీతానికి భారత స్వాతంత్ర్య పోరాటంలో విశేష ప్రాధాన్యం ఉంది. అయితే, క్రీడా కార్యక్రమాల్లో దీన్ని తప్పనిసరిగా ఆలపించాలని మార్గదర్శకాల్లో మొదట స్పష్టంగా పేర్కొనలేదు. దీంతో ఆదివారం నాటి క్రికెట్ మ్యాచ్‌లో వందేమాతరం వినిపించడం కొందరు అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ విషయంపై డీడీసీఏ అధికారి ఒకరు మాట్లాడుతూ, "దేశంలో జరిగే ప్రతి కార్యక్రమంలో జాతీయ గీతానికి ముందు వందేమాతరం ఆలపించాలని హోం శాఖ మార్గదర్శకాల్లో ఉంది. ఈ విషయం ఆట నిర్వహణలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ తెలుసు" అని ఐఏఎన్ఎస్‌కు వివరించారు. ఈ కొత్త ప్రోటోకాల్‌తో ఒక అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ జరగడం ఇదే మొదటిసారి.

## SPORTS

# మహిళల ఆసియా కప్ భారత్ కైవసం

**శ్రీలంకపై 72 పరుగుల ఘన విజయం**
**రికార్డు స్థాయిలో ఎనిమిదో ఆసియా కప్ టైటిల్ సాధించిన భారత జట్టు**

న్యూస్, సెప్టెంబర్ 13 : మహిళల టీ20 ఆసియా కప్ 2026 టైటిల్‌ను భారత జట్టు కైవసం చేసుకుంది. దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఆదివారం జరిగిన ఫైనల్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ శ్రీలంకను భారత్ 72 పరుగుల తేడాతో ఓడించింది.టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 183 పరుగులు చేసింది. టోర్నీలో భారత్ నమోదు చేసిన అత్యధిక స్కోరుగా ఇది నిలిచింది.అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన శ్రీలంకను భారత బౌలర్లు సమర్థంగా కట్టడి చేశారు. శ్రీలంక జట్టు 111 పరుగులకే ఆలౌట్ కావడంతో భారత్ భారీ విజయాన్ని అందుకుంది.ఈ విజయంతో మహిళల ఆసియా కప్‌లో భారత్ మొత్తం ఎనిమిదో టైటిల్‌ను సాధించింది. 2024లో శ్రీలంక చేతిలో ఎదురైన ఫైనల్ పరాజయానికి భారత్ ఈసారి ఘన




విజయంతో బదులిచ్చింది.భారత మహిళల జట్టు సాధించిన ఈ విజయం రాబోయే అంతర్జాతీయ పోటీలకు మరింత ఆత్మవిశాసాన్ని అందిస్తుందని క్రీడా వర్గాలు పేర్కొంటున్నాయి.

# యూఎస్ రిబాకినాదే

న్యూయార్క్: సీజన్ నాలుగో గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్‌లో మహిళల సింగిల్స్ టైటిల్‌ను కజకిస్థాన్ అమ్మాయి ఎలెనా రిబాకినా దక్కించుకుంది. భారత కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున ఆర్థర్ ఆషే స్టేడియంలో జరిగిన ఫైనల్‌లో రిబాకినా.. 6-4, 5-7, 6-2తో డిఫెండింగ్ చాంపియన్ అరీనా సబలెంకా (బెలారస్)కు షాకిచ్చి ఈ ఏడాది రెండో గ్రాండ్‌స్లామ్‌ను గెలుచుకుంది. ప్రపంచ 1, 2వ ర్యాంకర్ల మధ్య మూడు సెట్ల పాటు 2 గంటల 21 నిమిషాల పాటు సాగిన ఉత్కంఠ పోరులో రిబాకినానే పైచేయి అయింది.న్యూయార్క్‌లో హ్యాట్రిక్ టైటిల్ నెగ్గాలన్న సబలెంకా ఆశలను అడియాసలు చేస్తూ నయా వరల్డ్ నంబర్ వన్ తన కెరీర్‌లో తొలిసారి యూఎస్ ఓపెన్ టైటిల్‌ను సాధించింది. ఈ ఏడాది ఆరంభంలో జరిగిన ఆస్ట్రేలియా ఓపెన్‌లోనూ సబలెంకాపై గెలిచిన కజకిస్థాన్ ప్లేయర్.. తాజాగా న్యూయార్క్‌లోనూ అదే మ్యాజిక్‌ను రిపీట్ చేస్తూ ఆమె 'త్రీ పీట్' ఆశలపై నీళ్లుచల్లింది. సెమీస్‌లో గాఫ్‌ను ఓడించి బెలారస్ భామ నుంచి వరల్డ్ నంబర్ వన్ ర్యాంకును సొంతం చేసుకున్న ఈ ఆస్ట్రేలియా ఓపెన్ విన్నర్.. తాజాగా యూఎస్ ఓపెన్‌నూ గెలిచి వారం రోజుల వ్యవధిలోనే తన ప్రత్యర్థికి 'డబుల్' షాకులిచ్చింది. మహిళల సింగిల్స్‌లో 99 వారాల పాటు అగ్రస్థానంలో ఉన్న సబలెంకా స్థానాన్ని వచ్చేవారం నుంచి రిబాకినా ఆక్రమించనుంది.

**స్వయం తప్పిదాలతో..**

న్యూయార్క్‌లో వరుసగా నాలుగోసారి ఫైనల్ చేరి 2023 (ఫైనల్‌లో గాఫ్ చేతిలో ఓటమి) తర్వాత ఓటమన్నదే లేకుండా సాగుతూ 2012-14 (సెరెనా విలియమ్స్) తర్వాత ఇక్కడ హ్యాట్రిక్ సాధించాలన్న లక్ష్యంతో బరిలోకి దిగిన సబలెంకా.. స్వయంకృతాపరాధాలతో టైటిల్‌ను చేజార్చుకుంది. మ్యాచ్‌లో మొత్తం ఏకంగా 34 అనవసర తప్పిదాలు చేయడం ఆమె ఓటమికి కారణమయ్యాయి. తొలిసెట్‌లో ఇరువురు నువ్వానేనా అన్నట్టు తలపడ్డా ఆరో గేమ్‌లో గెలిచిన కజకిస్థాన్ ప్లేయర్ 4-2 ఆధిక్యంలోకి వెళ్లింది. క్రమంగా వెనుకబడ్డా సబలెంకా.. పదో గేమ్‌లో తన ట్రేడ్‌మార్క్ ఫోర్‌హ్యాండ్, బ్యాక్‌హ్యాండ్ షాట్లు ఆడటంలో విఫలమై ప్రత్యర్థికి పాయింట్లు ఇచ్చుకుంది.బ్యాక్‌హ్యాండ్ విన్నర్‌తో రిబాకినా గేమ్‌తో పాటు సెట్‌నూ గెలుచుకుంది. రెండో సెట్ సైతం ఉత్కంఠగా సాగిన సబలెంకా అద్భుతంగా పుంజుకుంది. పదో గేమ్‌లో స్కోర్లు 5-5తో సమమైనా వరుసగా రెండు పాయింట్లు సాధించిన బెలారస్ బామ.. మ్యాచ్‌ను మూడో సెట్‌కు తీసుకెళ్లింది. అయితే నిర్ణయాత్మక సెట్‌లో రిబాకినా జోరుతో పోరు ఏకపక్షమే అయింది. కోర్టులో ప్రత్యర్థులపై అరుపులు, కేకలతో విరుచుకుపడే సబలెంకాతో పోలిస్తే కూల్‌గా తన పని తాను చేసుకుపోయే రిబాకినా.. 2-1 ఆధిక్యంతో గెలుపుదిశగా సాగింది. స్కోరు 5-2తో ఉండగా మ్యాచ్ పాయింట్‌ను సాధించి ఏస్‌తో సెట్‌ను ముగించి తన కెరీర్‌లో తొలి యూఎస్ ఓపెన్ టైటిల్‌ను సాధించింది. మ్యాచ్‌లో రిబాకినా మొత్తం 12 ఏస్‌లు సంధించగా 36 విన్నర్లతో ప్రత్యర్థిపై పైచేయి సాధించింది. తాజా ఓటమితో 2023 తర్వాత ఈ టోర్నీలో అపజయమెరుగని సబలెంకా 19 విజయాల జైత్రయాత్రకు బ్రేక్ పడింది. మ్యాచ్ ముగిశాక ఆమె రాకెట్‌ను నేలకేసి కొట్టడమే గాక తనవైపుగా వచ్చిన కెమెరాలను అభ్యంతరకరంగా దూషిస్తూ అసహనం వ్యక్తం చేసింది.



ప్రైజ్‌మనీ

**రిబాకినా రూ.52.58 కోట్లు ,సబలెంకా రూ.26.75 కోట్లు**

పదేండ్లుగా ఇక్కడికి వస్తున్నా. కానీ ఈ వారం రోజుల్లో నేను ఊహించని ఎన్నో విజయాలు సొంతమయ్యాయి. ఈ ఫీలింగ్‌ను మాటల్లో చెప్పలేను. ఐయామ్ సూపర్ హ్యాపీ - రిబాకినా

3 రిబాకినా గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు (2022 వింబుల్డన్, 2026 ఆస్ట్రేలియా, 2026 యూఎస్)